RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్
సంపుటి: 4 సంచిక:102 | మంగళవారం
ఏప్రిల్ 07, 2026 | పేజీలు 8
వెల: రూ.3-00

లింగబత్తిని కృష్ణ
సీఎండీ & ఎడిటర్
9701923260



## నిండు ప్రాణం కాపాడేందుకు..

### శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి కిమ్స్ ఆస్పత్రికి గ్రీన్ ఛానల్ ఏర్పాటు

- అత్యవసరంగా ఊపిరితిత్తుల తరలింపు
- సాఫీగా వెళ్లేలా ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక చర్యలు
- బెంగళూరు నుంచి విమానంలో శంషాబాద్ చేరుకున్న వైద్య బృందం
- ప్రాణదాతల కృషితో ఊపిరితిత్తుల మార్పిడికి ముమ్మర ఏర్పాట్లు

2లో

## ఇంటర్ బోర్డు వద్ద ఉద్రిక్తత



### ముట్టడికి యత్నించిన పీడీఎస్‌యూ

- నిబంధనలకు విరుద్ధంగా క్లాసులు నిర్వహిస్తున్న కాలేజీలపై చర్యలకు డిమాండ్
- ప్రభుత్వ జీవోను ప్రైవేట్ యాజమాన్యాలు బేఖాతరు చేస్తున్నాయని ఆగ్రహం
- విద్యార్థి సంఘం నేతలను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించిన పోలీసులు

2లో




# సీక్రెట్ డేటింగ్!

## భారత్‌లో విస్తరిస్తున్న విష సంస్కృతి

### డేటింగ్ యాప్‌ల మాయలో 40 లక్షల మంది

- 'గ్లీడెన్' సంచలన సర్వేలో భయంకర నిజాలు
- హైదరాబాద్ సెకండ్.. బెంగళూరు ఫస్ట్..
- పక్కదారి పడుతున్న పవిత్ర బంధాలు
- ఆడవారే అధికం.. 148 శాతం పెరిగిన మహిళా యూజర్లు
- చీకటి మాటున సీక్రెట్ చాటింగ్
- మెట్రోలే కాదు, టైర్-2 నగరాల్లోనూ అధికమే..

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**

భారతీయ సంస్కృతిలో వివాహం అనేది ఒక పవిత్రమైన యజ్ఞం. కానీ, మారుతున్న కాలం, అరచేతిలోకి వచ్చిన టెక్నాలజీ ఈ పవిత్ర బంధాల పునాదులను కదిలిస్తున్నాయి. నైతికతకు మారుపేరుగా నిలిచే మన దేశంలో, ఇప్పుడు వివాహేతర డేటింగ్ ఒక విష సంస్కృతిలా విస్తరిస్తోంది. ఒకప్పుడు అత్యంత అపరాధంగా భావించిన ఈ వ్యవహారాలు, ఇప్పుడు గ్లీడెన్ వంటి యాప్స్ ద్వారా స్మార్ట్‌ఫోన్లలో బహిరంగ రహస్యాలుగా మారిపోయాయి. ఆశ్చర్యకరంగా, కేవలం పురుషులు మాత్రమే కాదు, మహిళా యూజర్ల సంఖ్య కూడా ఊహించని రీతిలో 148 శాతం పెరగడం సామాజిక విశ్లేషకులను విస్మయానికి గురిచేస్తోంది. ఐటీ హబ్‌లైన బెంగళూరు, హైదరాబాద్ నగరాలు ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలుస్తూ, ఆధునిక జీవనశైలిలోని చీకటి కోణాలను బయటపెడుతున్నాయి. అసలు 40 లక్షల మంది భారతీయులు ఈ యాప్స్‌లో ఏం చేస్తున్నారు? ఈ డిజిటల్ అఫైర్స్ వెనుక ఉన్న అసలు కారణాలేంటి? ఈ ప్రత్యేక కథనంలో చూద్దాం..



### భారతీయ కుటుంబ వ్యవస్థపై తీవ్ర ప్రభావం

2లో

## 45 రోజుల యుద్ధ విరమణకు రంగం సిద్ధం?



- పశ్చిమాసియా ఉద్రిక్తతల తగ్గింపునకు ఈజిప్ట్, పాకిస్థాన్, టర్కీల భారీ స్కెచ్
- హోర్ముజ్ జలసంధి పునరుద్ధరణే లక్ష్యంగా రెండు దశల ఒప్పందం
- అమెరికా ఉపాధ్యక్షుడితో పాక్ ఆర్మీ చీఫ్ కీలక చర్చలు

2లో

## రెండు స్థానాల నుంచి అతిపెద్ద పార్టీగా ఎదగడం గర్వకారణం



- ప్రధాని మోదీ నాయకత్వంలో వికసిత్ భారత్ దిశగా దేశం అడుగులు
- కార్యకర్తల త్యాగమే పార్టీకి అసలైన బలం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు
- ఘనంగా 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

2లో

## ఈట్ రైట్.. స్టే హెల్తీ..

- ఆరోగ్యకరమైన ఆహారంపై అవగాహన పెంచాలి
- ఫుడ్ సేఫ్టీపై కఠిన చర్యలు తీసుకోవాలి
- మంత్రి దామోదర్ రాజనర్సింహ
- మేళాలో ప్రత్యేక ఆకర్షణగా మిల్లెట్స్ స్టాల్స్

2లో



## ఆదిలాబాద్‌కు మహర్దశ

- రూ. వందల కోట్లతో అభివృద్ధి ప్రగతి ప్రణాళిక
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా భారీ ప్రాజెక్టులకు శంకుస్థాపన
- విద్య, సాగునీరు, మౌలిక వసతులే లక్ష్యంగా ప్రజాపాలన
- గిరిజన, గ్రామీణ ప్రాంతాల రూపురేఖలు మార్చే దిశగా అడుగులు

**వేద న్యూస్, ఆదిలాబాద్**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చరిత్రలో ఒక సరికొత్త ప్రగతి అధ్యాయం మొదలైంది. 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి జిల్లా పర్యటన అభివృద్ధి పనుల జడివానను కురిపించింది. బజార్‌హత్నూర్ మండలం పిప్రి గ్రామంలో నిర్వహించిన భారీ బహిరంగ సభ సాక్షిగా, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మరియు ఇతర మంత్రుల సమక్షంలో వందల కోట్ల రూపాయల ప్రాజెక్టులకు సీఎం శ్రీకారం చుట్టారు. ప్రధానంగా గిరిజన,

...మిగతా 2వ పేజీలో

## పాత పిల్లర్లపై ఇందిరమ్మ ఇళ్లు



### కూలిన వాటిపైనే మళ్లీ పనులు

- ప్రాణాలకు గ్యారెంటీ ఉందా?
- వేములవాడలో నాసిరకం నిర్మాణాలు
- భయాందోళనలో లబ్ధిదారులు
- అధికారుల నిర్లక్ష్యంపై నిరసన

2లో

**వేద న్యూస్, వేములవాడ**

పేదల సొంతింటి కలను నిజం చేయాల్సిన ప్రభుత్వ పథకం, ఇప్పుడు వారి ప్రాణాల మీదకు తెచ్చేలా కనిపిస్తోంది. వేములవాడ బస్ డిపో సమీపంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నాణ్యత ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఏళ్ల తరబడి ఎండకు ఎండి, వానకు తడిసి నిస్సారమైన పాత పిల్లర్లనే పునాదులుగా వాడుతుండటంతో లబ్ధిదారుల్లో వణుకు మొదలైంది. సాక్షాత్తూ ప్రభుత్వ విప్ పర్యటనలోనే పిల్లర్ కూలిపోయిన ఘటన నిర్మాణాల డొల్లతనాన్ని ఎత్తిచూపుతుంటే, మళ్లీ అవే శిథిలాలపై ఇళ్లు కట్టడం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలుస్తోంది.

వేద న్యూస్

మంగళవారం | ఏప్రిల్ 07, 2026

# నిండు ప్రాణం కాపాడేందుకు..

**వేద న్యూస్, హైదరాబాద్**

హైదరాబాద్ నగరంలో ఒక నిండు ప్రాణాన్ని కాపాడేందుకు ట్రాఫిక్ పోలీసులు, వైద్య బృందాలు కలిసి మరోసారి మానవత్వాన్ని చాటుకున్నాయి. బెంగళూరు నుండి సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి అత్యవసరంగా ఊపిరితిత్తులను తరలించేందుకు పోలీసులు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి ఆస్పత్రి వరకు 'గ్రీన్ ఛానెల్' ఏర్పాటు చేశారు. ఒక రోగికి అత్యవసరంగా ఊపిరితిత్తుల మార్పిడి శస్త్రచికిత్స చేయాల్సి ఉండటంతో, దాత నుండి సేకరించిన అవయవాలను సమయం వృథా కాకుండా తరలించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. వైద్య నిపుణుల బృందం వీటిని ప్రత్యేక విమానంలో బెంగళూరు నుండి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు తీసుకువచ్చింది. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుండి సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి సుమారు 30 కిలోమీటర్లకు పైగా దూరం ఉన్నప్పటికీ, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో అంబులెన్స్ ప్రయాణానికి ఎటువంటి అడ్డంకులు లేకుండా మార్గాన్ని సుగమం చేశారు. మధ్యాహ్నం సమయంలో ఈ తరలింపు ప్రక్రియను ప్రారంభించి, సిగ్నల్స్ అన్నీ క్లియర్ చేస్తూ అంబులెన్స్ వేగంగా ఆస్పత్రికి చేరేలా చర్యలు తీసుకున్నారు.

# ఇంటర్ బోర్డు వద్ద ఉద్రిక్తత

**వేద న్యూస్, హైదరాబాద్**

తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యా మండలి (ఇంటర్ బోర్డు) కార్యాలయం వద్ద సోమవారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వేసవి సెలవుల్లో నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేట్ మరియు కార్పొరేట్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం నేతలు బోర్డు ముట్టడికి యత్నించారు. ముందస్తు అనుమతి లేకుండా కార్యాలయంలోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన విద్యార్థి నేతలను పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. దీంతో నాంపల్లిలోని ఇంటర్ బోర్డు పరిసర ప్రాంతాల్లో కొద్దిసేపు తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ నాయకులు మాట్లాడుతూ, వేసవి సెలవుల దృష్ట్యా ప్రభుత్వం ప్రకటించిన నిబంధనలను ప్రైవేట్ కాలేజీలు ఏమాత్రం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవో కేవలం ప్రభుత్వ కాలేజీలకే పరిమితమైందా? అని వారు ప్రశ్నించారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నప్పటికీ, అడ్మిషన్ల పేరుతో విద్యార్థులపై ఒత్తిడి తెస్తూ క్లాసులు నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# యుద్ధ విరమణకు రంగం సిద్ధం?

**వేద న్యూస్, నేషనల్ డెస్క్**

పశ్చిమాసియాలో ముదురుతున్న ఇరాన్ సంక్షోభానికి తెరదించేందుకు అంతర్జాతీయ స్థాయిలో దౌత్య ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ దళాల దాడులను ఆపి, ప్రాంతీయ శాంతిని నెలకొల్పేందుకు ఈజిప్ట్, పాకిస్థాన్ మరియు టర్కీ దేశాలు సంయుక్తంగా ఒక కీలక ప్రతిపాదనను సిద్ధం చేశాయి. ఇందులో భాగంగా కనీసం 45 రోజుల పాటు తాత్కాలిక కాల్పుల విరమణ పాటించాలని ఆ దేశాలు ప్రణాళికను రూపొందించాయి. యుద్ధ వాతావరణం వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అవుతున్న నేపథ్యంలో, ఈ 45 రోజుల విరామం ద్వారా శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేయవచ్చని పశ్చిమాసియా దౌత్యవేత్తలు భావిస్తున్నారు. ముఖ్యంగా అంతర్జాతీయ వాణిజ్యానికి అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి రీఓపెనింగ్ అంశంపై అమెరికా, ఇరాన్ మధ్య తీవ్ర స్థాయి పోరు నడుస్తోంది. ఈ ప్రతిపాదిత ఒప్పందం ప్రకారం, కాల్పుల విరమణ అమల్లోకి వచ్చిన వెంటనే హోర్ముజ్ జలసంధిని తక్షణమే తెరిచేలా నిబంధనలు రూపొందించారు. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగాచి మరియు అమెరికా ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్‌లకు ఈ ఒప్పంద ప్రతిపాదనలు ఇప్పటికే అందినట్లు సమాచారం.

# ఈట్ రైట్ - స్టే హెల్తీ

**వేద న్యూస్, హైదరాబాద్**

నేచర్ క్యూర్ ఆసుపత్రిలో సోమవారం నిర్వహించిన "ఈట్ రైట్ – స్టే హెల్తీ" మేళాలో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేళాలో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను సందర్శించి ఆహార నాణ్యత, భద్రత అంశాలపై అవగాహన పొందారు. మేళాలో భాగంగా మిల్లెట్స్‌తో తయారు చేసిన ఆహార పదార్థాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మిల్లెట్స్ ఐస్ క్రీమ్, కాఫీ వంటి విభిన్న వంటకాలను మంత్రి రుచి చూసి వాటి తయారీ విధానంపై వివరాలు తెలుసుకున్నారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం ద్వారా ప్రజలు మంచి జీవనశైలిని అలవరచుకోవాలని సూచించారు.

# సీక్రెట్ డేటింగ్!

## భారత్‌లో విస్తరిస్తున్న విష సంస్కృతి

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**

భారతదేశం.. ప్రపంచ దేశాలన్నీ ముక్కున వేలేసుకునేలా అత్యున్నత కుటుంబ విలువలు కలిగిన దేశం. ఇక్కడ వివాహం అనేది కేవలం ఇద్దరు వ్యక్తుల కలయిక మాత్రమే కాదు, రెండు కుటుంబాల నడుమ జరిగే ఒక పవిత్రమైన బంధం. కానీ, మారుతున్న కాలంతో పాటు గ్లోబలైజేషన్ తెచ్చిన పెనుమార్పులు ఇప్పుడు మన సంప్రదాయ పునాదులను కదిలిస్తున్నాయి. ఆధునికత ముసుగులో దేశంలో 'సీక్రెట్ డేటింగ్' సంస్కృతి చాపకింద నీరులా విస్తరిస్తోంది. ముఖ్యంగా వివాహేతర సంబంధాలను ప్రోత్సహించే యాప్స్ వైపు భారతీయులు భారీగా క్యూ కడుతుండటం ఇప్పుడు సామాజిక విలువల పతనానికి నిదర్శనంగా నిలుస్తోంది.




### డేటింగ్ యాప్‌ల మాయలో 40 లక్షల మంది

- 'గ్లీడెన్' సంచలన సర్వేలో భయంకర నిజాలు
- హైదరాబాద్ సెకండ్.. బెంగళూరు ఫస్ట్..
- పక్కదారి పడుతున్న పవిత్ర బంధాలు
- ఆడవారే అధికం.. 148 శాతం పెరిగిన మహిళా యూజర్లు
- చీకటి మాటున సీక్రెట్ చాటింగ్
- మెట్రోలే కాదు, టైర్-2 నగరాల్లోనూ అధికమే

### 40 లక్షల మంది 'గ్లీడెన్' బాట!

ఒకప్పుడు వివాహేతర సంబంధం అంటే అది అత్యంత రహస్యంగా, అపరాధ భావంతో కూడిన వ్యవహారంగా ఉండేది. కానీ ఇప్పుడు స్మార్ట్‌ఫోన్లు, హైస్పీడ్ ఇంటర్నెట్ పుణ్యమా అని అన్నీ అరచేతిలోకి వచ్చేసాయి. ప్రముఖ అంతర్జాతీయ వివాహేతర డేటింగ్ ప్లాట్‌ఫారమ్ 'గ్లీడెన్' వెల్లడించిన తాజా గణాంకాలు దేశాన్ని నివ్వెరపరుస్తున్నాయి. దాదాపు 40 లక్షల మంది భారతీయులు ఈ యాప్‌లో సభ్యులుగా ఉంటూ తమ జీవిత భాగస్వామికి తెలియకుండా మరో వ్యక్తి కోసం వెతుకుతున్నారు. శృంగారం అనేది అత్యంత రహస్య, పవిత్రమైన కార్యంగా భావించే మన దేశంలో, తెరవెనుక జరుగుతున్న ఈ 'డిజిటల్ వ్యభిచారం' విస్తుగొలిపే వాస్తవాలను బయటపెడుతోంది.

### బెంగళూరు టాప్, హైదరాబాద్ సెకండ్!

ఈ డేటింగ్ సంస్కృతి కేవలం పాశ్చాత్య దేశాలకో, లేదా ఉత్తరాది నగరాలకో పరిమితం కాలేదు. ఐటీ హబ్‌లుగా పేరుగాంచిన నగరాల్లో ఇది విపరీతంగా పెరిగిపోయింది. పని ఒత్తిడి, ఒంటరితనం లేదా కేవలం కొత్తదనం కోసం చూసే ధోరణి ఇందుకు కారణమవుతోంది. ఓ తాజా సర్వే ప్రకారం.. దేశంలోనే బెంగళూరు టాప్ ప్లేస్ లో ఉండి, అత్యధికంగా 18 శాతం మంది యూజర్లతో సిలికాన్ వ్యాలీ కాస్తా డేటింగ్ వ్యాలీగా మారుతోందా అనే సందేహం కలిగిస్తోంది. మన భాగ్యనగరం 17 శాతంతో దేశంలోనే రెండో స్థానంలో నిలిచి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఐటీ కల్చర్ పెరగడం, మారుతున్న జీవనశైలి ఇక్కడ ఈ సంస్కృతికి ఊతమిస్తున్నాయి. ఢిల్లీ (11%), ముంబై (9%), పూణే (7%)తో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, కేవలం మెట్రో నగరాలే కాకుండా లక్నో, పాట్నా, భువనేశ్వర్, సూరత్, చండీగఢ్ వంటి టైర్–2 నగరాల్లో కూడా ఈ ధోరణి వేగంగా పెరుగుతోంది. సంప్రదాయాలకు నిలయాలైన చిన్న నగరాలు కూడా ఇప్పుడు ఈ విష సంస్కృతి ఉచ్చులో చిక్కుకుంటున్నాయి.

### మహిళా యూజర్ల పెరుగుదల..

ఈ నివేదికలో అత్యంత సంచలన విషయం ఏమిటంటే మహిళల భాగస్వామ్యం. గత రెండేళ్లలో గ్లీడెన్ యాప్‌లో మహిళా యూజర్ల సంఖ్య ఏకంగా 148 శాతం పెరగడం ఒక ప్రకంపన సృష్టించింది. అసలు మహిళలు ఈ అడ్డదారుల వైపు ఎందుకు మళ్లుతున్నారు? దీనిపై గ్లీడెన్ ఇండియా కంట్రీ మేనేజర్ సిబిల్ షిడెల్ మాట్లాడుతూ.. మహిళలు తమ వ్యక్తిగత నిర్ణయాల్లో పెరిగిన స్వేచ్ఛ, ఆత్మవిశ్వాసమే దీనికి కారణమని విశ్లేషించారు. అయితే, ఇక్కడ మరో కోణం కూడా ఉంది. ఈ యాప్‌ను వాడుతున్న మహిళల్లో అత్యధికంగా డాక్టర్లు, చార్టర్డ్ అకౌంటెంట్లు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, సీనియర్ ఎగ్జిక్యూటివ్స్ వంటి ఆర్థికంగా స్థిరపడిన ప్రొఫెషనల్స్ ఉండటం గమనార్హం. ఆర్థిక స్వతంత్రత పెరగడం వల్ల సమాజం లేదా కుటుంబం ఏమనుకుంటుందనే భయం తగ్గడం, వైవాహిక జీవితంలో భావోద్వేగాల లోటు దీనికి ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి.

### డ్యూటీ అవర్స్‌లోనూ డేటింగ్.. టైమింగ్స్ ఇవే!

ఈ రహస్య డేటింగ్ కేవలం రాత్రి సమయాలకే పరిమితం కాలేదు. గ్లీడెన్ డేటా ప్రకారం, యూజర్లు సగటున రోజుకు గంట నుంచి గంటన్నర పాటు ఇందులో గడుపుతున్నారు. ఈ 'వర్చువల్ అఫైర్స్' ఎప్పుడు జోరుగా సాగుతాయో కూడా సర్వే వెల్లడించింది.. మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల మధ్య.. అంటే ఆఫీసుల్లో లంచ్ బ్రేక్ సమయంలో లేదా ఇంటి పనుల మధ్య దొరికిన ఖాళీలో ఈ రహస్య చాటింగ్ అధికంగా సాగుతోంది. కుటుంబ సభ్యులంతా నిద్రపోయిన తర్వాత చీకటి మాటున సాగే ఈ సంభాషణలు ఎందరో జీవితాల్లో చిచ్చు పెడుతున్నాయి. ఆసక్తికరంగా పురుషులు 25–30 ఏళ్ల యువతుల కోసం సెర్చ్ చేస్తుండగా, మహిళలు మాత్రం 30–40 ఏళ్ల వయస్సుండి, సమాజంలో మంచి హోదాలో ఉన్న పురుషుల పట్ల ఆసక్తి చూపిస్తున్నారు.



### ప్రమాదంలో కుటుంబ వ్యవస్థ

ఆధునికత పేరుతో పెరుగుతున్న ఈ 'విష సంస్కృతి' మన పవిత్రమైన వివాహ వ్యవస్థను కుప్పకూల్చే ప్రమాదం ఉంది. సాంకేతికతను సామాజిక విలువల పెంపునకు వాడుకోవాలి కానీ, ఇలాంటి విచ్ఛిన్నకర పోకడలకు కాదు. 40 లక్షల మంది వివాహేతర డేటింగ్‌లో ఉన్నారనే వాస్తవం, సమాజంలో నైతిక విలువల పతనానికి అద్దం పడుతోంది. కేవలం ఒక యాప్ ద్వారా లభించే తాత్కాలిక సుఖం కోసం, జన్మజన్మల బంధాన్ని, నమ్మకాన్ని పణంగా పెట్టడం విచారకరం. ఇప్పటికైనా వ్యక్తులు, సమాజం ఈ విషయంలో అప్రమత్తం కాకపోతే భవిష్యత్తులో కుటుంబం అనే పదానికి అర్థమే మారిపోయే ప్రమాదం ఉంది.

## రెండు స్థానాల నుంచి అతిపెద్ద పార్టీగా ఎదగడం

# గర్వకారణం

**వేద న్యూస్, హైదరాబాద్**

భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం నాంపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు పార్టీ జెండాను ఆవిష్కరించి, అక్కడ సమావేశమైన కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. 1984లో కేవలం రెండు పార్లమెంటు స్థానాల నుండి ప్రారంభమై, నేడు ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా ఎదగడం పార్టీ సిద్ధాంతాలకు ప్రజలు ఇస్తున్న మద్దతుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. దేశమే ప్రథమం అనే జాతీయవాద సిద్ధాంతంపై ప్రజలకున్న అచంచల విశ్వాసం వల్లే వరుసగా మూడోసారి కేంద్రంలో అధికారం చేపట్టగలిగామని ఆయన స్పష్టం చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అద్భుత దార్శనికతతో భారతదేశం వికసిత్ భారత్ దిశగా సగర్వంగా ముందడుగు వేస్తోందని రామచందర్ రావు కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రికార్డు స్థాయి నిధులతో తెలంగాణ రాష్ట్రం కూడా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని ఆయన వివరించారు. ముఖ్యంగా జాతీయ రహదారులు, రైల్వేలు మరియు ఇతర మౌలిక సదుపాయాల కల్పనలో కేంద్రం తెలంగాణకు పెద్దపీట వేస్తోందని, దీనివల్ల వికసిత్ తెలంగాణ సాకారం అవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు చేరవేయడంలో కేంద్రం పారదర్శకతను పాటిస్తోందని ఆయన గుర్తు చేశారు. బిజెపి కేవలం ఒక రాజకీయ వేదిక మాత్రమే కాదని, ఇది త్యాగం, సేవాభావం మరియు జాతీయ పునర్నిర్మాణ సంకల్పంతో నిర్మితమైన ఒక మహా ఉద్యమమని రామచందర్ రావు అభివర్ణించారు. దీన్ దయాళ్ ఉపాధ్యాయ అందించిన అంత్యోదయ స్ఫూర్తితో, సమాజంలోని చివరి వ్యక్తికి కూడా ఫలాలు అందాలనే లక్ష్యంతో పార్టీ పనిచేస్తోందని తెలిపారు. సబ్ కా సాథ్ – సబ్ కా వికాస్ అనే మంత్రంతో నిస్వార్థంగా దేశ సేవ చేస్తున్న క్రమశిక్షణ గల కార్యకర్తలే ఈ పార్టీకి అసలైన బలం మరియు ప్రాణం అని ఆయన ప్రశంసించారు

# పాత పిల్లర్లపై ఇందిరమ్మ ఇళ్లు

### కూలిన వాటిపైనే మళ్లీ పనులు

- ప్రాణాలకు గ్యారెంటీ ఉందా?
- వేములవాడలో నాసిరకం నిర్మాణాలు
- భయాందోళనలో లబ్ధిదారులు
- అధికారుల నిర్లక్ష్యంపై నిరసన



**వేద న్యూస్, వేములవాడ**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం తీవ్ర వివాదాస్పదంగా మారింది. పేదలకు గూడు కల్పించాలనే ప్రభుత్వ లక్ష్యం బాగున్నా, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనుల నాణ్యత లబ్ధిదారుల ప్రాణాల మీదకు తెచ్చేలా ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. బస్ డిపో సమీపంలో నిర్మిస్తున్న ఈ ఇళ్లలో పాత, బలహీనపడిన పిల్లర్లను వాడుతుండటం ఇప్పుడు చర్చనీయాంశమైంది.

### పాతవాటినే పునాదిగా మార్చడంపై అభ్యంతరం

గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ ఇళ్ల నిర్మాణం ప్రారంభమైనప్పటికీ, కొన్ని కారణాల వల్ల మధ్యలోనే నిలిచిపోయాయి. అప్పట్లో వేసిన పిల్లర్లు ఏళ్ల తరబడి ఎండకు ఎండి, వానకు తడిసి పాడైపోయాయి. ఇనుప ఊచలు తుప్పుపట్టి బలహీనపడ్డాయి. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అదే స్థలంలో నిర్మాణాలను పునఃప్రారంభించింది. అయితే, పాత పిల్లర్ల నాణ్యతను పరీక్షించకుండా, వాటిని తొలగించకుండానే నేరుగా పనులు చేపట్టడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### విప్ పర్యటనలోనే కుప్పకూలిన పిల్లర్

నిర్మాణాల్లో డొల్లతనం ఇటీవల బహిర్గతమైంది. గత నవంబర్ 26వ తేదీన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మరియు జిల్లా కలెక్టర్ నిర్మాణాలను పరిశీలిస్తున్న సమయంలోనే ఒక పిల్లర్ అకస్మాత్తుగా కూలిపోవడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో ప్రజలు ఉలిక్కిపడ్డారు. అధికారుల కళ్లముందే నాణ్యత లోపం కనబడుతున్నా, మళ్లీ అదే పిల్లర్లపై నిర్మాణం కొనసాగించడంపై లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### భయం నీడలో లబ్ధిదారులు

మరోవైపు, ఇళ్లు మంజూరైన పేదలు ఆ ఇళ్లలోకి వెళ్లాలంటేనే జంకుతున్నారు. ముందు నుయ్యి వెనుక గొయ్యి చందంగా తమ పరిస్థితి మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలిపోయే స్థితిలో ఉన్న ఇళ్లలో ప్రాణాలకు తెగించి ఎలా నివసిస్తామని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రమాదకర నిర్మాణాలపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. ఇంజనీరింగ్ నిపుణులతో నాణ్యత పరీక్షలు నిర్వహించాలని, పనికిరాని పాత నిర్మాణాలను పూర్తిగా తొలగించి కొత్తగా ఇళ్లను నిర్మించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. పేదల సొంతింటి కలను శ్మశానవాటికగా మార్చవద్దని ప్రభుత్వానికి విన్నవిస్తున్నారు.

# ఆదిలాబాద్‌కు మహర్దశ

మొదటి పేజీ తరువాయి

వెనుకబడిన ప్రాంతాల అభ్యున్నతే ధ్యేయంగా సాగిన ఈ పర్యటనలో విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత లభించింది. బోథ్ నియోజకవర్గం అడేగామాలో రూ.200 కోట్లతో, నిర్మల్ జిల్లా సిర్గాపూర్‌లో మరో రూ.200 కోట్లతో నిర్మించనున్న 'యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలలు' జిల్లా విద్యార్థుల భవిష్యత్తును మార్చబోతున్నాయి. దీనికి అదనంగా పొచ్చెరలో రూ.45.15 కోట్లతో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్, ఆదిలాబాద్‌లో మైనారిటీ విద్యార్థుల కోసం రూ.20 కోట్లతో నిర్మించనున్న రెసిడెన్షియల్ భవనం విద్యా రంగంలో పెనుమార్పులకు సంకేతంగా నిలుస్తున్నాయి. అభివృద్ధి కేవలం విద్యకే పరిమితం కాకుండా సాగునీరు, మౌలిక వసతుల కల్పనలోనూ వేగం పుంజుకుంది. పిప్రి, తేజాపూర్ ఎత్తిపోతల పథకాల కోసం దాదాపు రూ.95 కోట్లకు పైగా నిధులు కేటాయించడం ద్వారా సామాన్య రైతులకు సాగునీటి భరోసా లభించింది. వీటితో పాటు ముత్నూర్ లిఫ్ట్ ఇరిగేషన్, చెక్ డ్యాంలు, చిక్‌మన్ వాగు ప్రాజెక్టులు వ్యవసాయాన్ని పండుగ చేసే దిశగా అడుగులు వేస్తున్నాయి. రవాణా వ్యవస్థను మెరుగుపరిచేందుకు కొండాపూర్‌లో రూ.13.46 కోట్లతో నిర్మించిన వంతెనను ప్రారంభించడంతో పాటు, బోథ్ నియోజకవర్గంలో రూ.30 కోట్లతో కొత్త రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలో రూ.30 కోట్లతో చేపట్టిన 38 అభివృద్ధి పనులు పట్టణ రూపురేఖలను మార్చనున్నాయి. మరోవైపు, గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ నాగోబా దేవస్థాన అభివృద్ధికి రూ.20.10 కోట్లు కేటాయించడం ద్వారా ఆధ్యాత్మికతకు, సంస్కృతికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఉట్నూర్‌లో రూ.15 కోట్లతో ఐటీడీఏ నూతన భవనం, విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణం వంటి పనులతో జిల్లా సర్వతోముఖాభివృద్ధికి ముఖ్యమంత్రి పక్కా ప్రణాళికను అమలు చేశారు. ఈ భారీ ప్రాజెక్టులన్నీ పూర్తయితే ఆదిలాబాద్ జిల్లా సామాజిక, ఆర్థిక స్థితిగతులు సమూలంగా మారి, అభివృద్ధిలో రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తుందని ఈ పర్యటన స్పష్టం చేసింది.

వేద న్యూస్

మంగళవారం ఏప్రిల్ 07, 2026

# గ్రామాభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర అత్యంత కీలకం

**– కందుగుల గ్రామ ఉపసర్పంచ్ మండ సతీష్**



**వేద న్యూస్, హుజురాబాద్:**

గ్రామ అభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర ఎంతో కీలకమని కందుగుల గ్రామ ఉపసర్పంచ్ మండ సతీష్ అన్నారు. సోమవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాల్లో నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులకు జనరల్ ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన సతీష్ మాట్లాడుతూ... పంచాయతీ సమావేశాలలో తీర్మానాలను ప్రవేశపట్టడంలో వార్డు సభ్యులకు అధికారం ఉంటుందన్నారు. పంచాయతీ రికార్డులను సైతం పరిశీలించవచ్చునని చెప్పారు. సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు ఐక్యంగా ఉండి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని సూచించారు. పంచాయతీరాజ్ చట్టంపై వార్డు సభ్యులు అవగాహన పెంచుకోవాలన్నారు. వార్డు సభ్యులందరూ సమన్వయంతో పనిచేసి గ్రామ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించుకోవలన్నారు. వార్డుల్లోని పారిశుద్ధ్యం, వీధి దీపాలు, తాగునీటి సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలి అన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడాలన్నారు. గ్రామ పంచాయతీల్లో వార్డు సభ్యుడు సర్పంచ్, పంచాయతీ కార్యదర్శిని సమన్వయం చేసుకుంటూ అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.

# మోడల్ స్కూల్ 'అటల్ టింకరింగ్ ఎక్స్పో'

**– ఆకట్టుకున్న విద్యార్థుల వినూత్న సైన్స్ ప్రాజెక్టులు**

**వేద న్యూస్, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో కోడింగ్ యంత్రా లెర్నింగ్ సొల్యూషన్స్, హైదరాబాద్ ఆధ్వర్యంలో 'అటల్ టింకరింగ్ 2026 ఎక్స్పో' ఘనంగా నిర్వహించారు. ఈ ఎక్స్పోలో మొత్తం 40 ప్రాజెక్టులు ప్రదర్శించగా, విద్యార్థులు నిత్య జీవితానికి ఉపయోగపడే పలు సైన్స్ ఆధారిత ఆవిష్కరణలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ శ్రావణ్ కుమార్ విద్యార్థులకు పార్టిసిపేషన్ సర్టిఫికేట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అబ్స్టకిల్ అవాయిడింగ్ రోబో, క్లాస్‌రూమ్ డిస్టర్బెన్స్ మానిటరింగ్ సిస్టమ్, ఆల్కహాల్ డిటెక్షన్ అండ్ ఇంజిన్ లాకింగ్ సిస్టమ్ వంటి ప్రాజెక్టులను ప్రశంసించారు. విద్యార్థులు మరింత సృజనాత్మకంగా ఆలోచించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్ ఇన్‌చార్జి గొళ్ళె శ్రీనివాస్, సైన్స్ ఉపాధ్యాయులకు పాఠశాల ప్రిన్సిపాల్ ఏరువ రఘునాథ్ కృతజ్ఞతలు తెలిపారు.

# గ్రానైట్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలి

**– మైనింగ్ దందాకు సూత్రధారులపై విచారణ కోరుతూ సీపీఐ వినతి**



**వేద న్యూస్, సైదాపూర్ :**

సైదాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో అక్రమంగా సాగుతున్న గ్రానైట్ క్వారీలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఐ పార్టీ మండల కార్యదర్శి లంకదాసరి కళ్యాణ్ డిమాండ్ చేశారు. సోమవారం కరీంనగర్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ గ్రానైట్ తవ్వకాలు జరుపుతూ పన్నులు ఎగవేస్తున్నారని ఆరోపించారు. అధికారుల అండతో అక్రమ బ్లాస్టింగ్‌లు నిర్వహిస్తూ భారీగా గ్రానైట్ బ్లాకులను తరలిస్తున్నారని పేర్కొన్నారు. అధిక లోడుతో రవాణా చేయడం వల్ల రహదారులు దెబ్బతింటున్నాయని, ప్రజా రవాణాకు ఇబ్బందులు కలుగుతున్నాయని అన్నారు. అనుమతులకు మించి లోతు, విస్తీర్ణంలో తవ్వకాలు జరగడంతో భూగర్భ జలాలు తగ్గిపోవడం, పర్యావరణ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. క్వారీల నుంచి ఎగిసే దుమ్ము, ధూళి కారణంగా రైతుల పంటలు దెబ్బతింటున్నాయని, దీని ప్రభావం తీవ్రంగా ఉంటుందని తెలిపారు. లారీ డ్రైవర్ల నిర్లక్ష్యంగా డ్రైవింగ్ కారణంగా ప్రమాదాలు పెరుగుతున్నాయని కూడా పేర్కొన్నారు. అక్రమ మైనింగ్ మాఫియాపై తక్షణ చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో మండల వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## రామాయంపేట మండలంలో
# బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



**వేద న్యూస్, బోయినిపల్లి :**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరణ చేసి, స్థాపక నాయకులు డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ, పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండల అధ్యక్షుడు ఎడపల్లి పరశురామ్ మాట్లాడుతూ, దేశ సమగ్రత కోసం శ్యామ ప్రసాద్ ముఖర్జీ చేసిన త్యాగాలను గుర్తు చేశారు. అంత్యోదయ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన దీన్ దయాల్ ఉపాధ్యాయ ఆలోచనలు సమాజంలోని చివరి వ్యక్తి అభివృద్ధికి మార్గదర్శకమని తెలిపారు. దేశభక్తి, జాతీయత, సేవా తత్వాలతో బీజేపీ ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా ఎదిగిందని పేర్కొన్నారు. మండలంలో పార్టీ అభివృద్ధికి కృషి చేసిన కార్యకర్తలను ఈ సందర్భంగా స్మరించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కౌన్సిల్ సభ్యుడు దారి నరసింహాచారి, మాజీ మండలాధ్యక్షుడు గుడి రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు బొంగోని అశోక్ గౌడ్, సుంకపాక ప్రభు, పసిగంటి వెంకటేశం, మెరుపుల గంగాధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని బూత్ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌పై అవగాహన

**– వేధింపులపై నిర్భయంగా ఫిర్యాదు చేయాలి**
**– ఎస్పీ మహేష్ బి. గితే**




**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల :**

మహిళలు, విద్యార్థినుల భద్రత కోసం జిల్లాలో షీ టీమ్ నిరంతరం చర్యలు చేపడుతోందని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ఎలాంటి వేధింపులకు గురైనా భయపడకుండా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. మార్చి నెలలో అందిన ఫిర్యాదులపై 3 ఎఫ్ఐఆర్‌లు, 4 పెటీ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వేధింపులకు పాల్పడుతున్న వారిని గుర్తించి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించామని పేర్కొన్నారు. రోడ్లు, బస్టాండ్లు, విద్యాసంస్థలు, ఉద్యోగ ప్రదేశాల్లో ఎవరైనా వేధించినా వెంటనే షీ టీమ్‌కు 8712656425 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రతి ఫిర్యాదుపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లాలోని విద్యాసంస్థలు, ప్రజా ప్రదేశాల్లో ర్యాగింగ్, ఇవ్‌టీజింగ్, పోక్సో, మహిళా రక్షణ చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థినులు అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని, వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని, ముఖ్యంగా సోషల్ మీడియా పరిచయాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# త్వరలో సబ్ స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభం

**– విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం**
**– ప్రాజెక్ట్ డైరెక్టర్ మోహన్ రావు**

**వేద న్యూస్, చందుర్తి :**



చందుర్తి మండలంలోని ఎన్గల్, లింగంపేట్ గ్రామాల్లో ప్రతిపాదించిన నూతన సబ్ స్టేషన్ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమవుతాయని ఎన్పిడిసిఎల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మోహన్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన రాజన్న సిరిసిల్ల ఎస్ఈ భిక్షపతి, సిరిసిల్ల డిఈ అంజయ్య, ఏడీఈ వేములవాడతో కలిసి ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. సబ్ స్టేషన్ పూర్తయిన తరువాత మల్యాల, లింగంపేట్, మర్రిగడ్డ సబ్ స్టేషన్లపై ఉన్న లోడ్ తగ్గడంతో పాటు పరిసర గ్రామాల్లో లో వోల్టేజ్ సమస్య పూర్తిగా నివారమవుతుందని తెలిపారు.

# ఇసుక కోసం ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేయాలి నగేష్

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల :**

**– కూపన్ విధానం రద్దు**
**– అదనపు కలెక్టర్ గడ్డం**



నిర్మాణదారులు ఇసుక కోసం 'మన ఇసుక వాహనం' యాప్ లేదా వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ రూపొందించిన ఈ వ్యవస్థ ద్వారా నిర్మాణదారులు తమకు నచ్చిన ఇసుక రీచ్ నుంచి నేరుగా బుకింగ్ చేసుకునే సౌకర్యం ఉందన్నారు. అవసరమైన పత్రాలు జతచేస్తే సులభంగా ఇసుక పొందవచ్చని తెలిపారు. జిల్లా కమిటీ ఆమోదించిన ఇసుక రీచ్‌ల నుంచే సరఫరా జరుగుతుందని, ఇకపై నేరుగా కూపన్లు ఇచ్చే విధానం రద్దు చేసినట్లు స్పష్టం చేశారు. ఆన్‌లైన్ విధానం ద్వారా ఇసుక కేటాయింపు, తరలింపు పారదర్శకంగా జరుగుతుందని పేర్కొన్నారు. మధ్యవర్తుల అవసరం లేకుండా ప్రజలు నేరుగా బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించడంతో అక్రమ రవాణా తగ్గుతుందని తెలిపారు. వివరాల కోసం టోల్ ఫ్రీ నంబర్లు 040-23120421, 8333923732 అలాగే helpdesk.tsmiv@cgg.gov.in మెయిల్ ద్వారా సంప్రదిం చవచ్చున్నారు. ఇసుక బుకింగ్ సమయంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ ధృవపత్రం, పంచాయతీ అనుమతి లేదా సంబంధిత అధికారుల పత్రాలను 200 కేబీ లోపు పీడీఎఫ్/జేపీజీ ఫార్మాట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. నిర్మాణదారులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు.

# మెట్టు రామలింగేశ్వరుడికి హుండీ బహూకరణ



**వేద న్యూస్, మడికొండ :**

వరంగల్ మడికొండ గ్రామంలోని దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన మెట్టుగుట్టపై గల శ్రీ సీతారామచంద్ర స్వామి, శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి దేవస్థానాల్లో భక్తులు హుండీని బహూకరించారు. భక్తులు రంగు హరికిషన్-సునీత దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి సుమారు రూ5 వేల విలువైన హుండీని సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించి, అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. రామాలయంలో విశేష అర్చనలు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి సత్యనారాయణ, అర్చకులు రాగిచేడు అభిలాష్ శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపల్లి సత్యనారాయణ శర్మ, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులపై కఠిన చర్యలు

**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం :**

**– ఎస్సై నవీన్ కుమార్**

ఇబ్రహీంపట్నం మండల పరిధిలో శాంతి భద్రతలకు భంగం కలిగించేలా సోషల్ మీడియాలో పోస్టులు, వీడియోలు, ఫోటోలు షేర్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై జి. నవీన్ కుమార్ హెచ్చరించారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో ఇతరులకు హాని కలిగించేలా, వర్గాలను కించపరిచేలా అసత్య సమాచారాన్ని పోస్ట్ చేయడం లేదా షేర్ చేయడం నేరమని స్పష్టం చేశారు. ఒక గ్రూప్‌లో ఇలాంటి పోస్టులు షేర్ అయితే ఆ గ్రూప్ అడ్మిన్ కూడా బాధ్యుడిగా పరిగణించబడతారని తెలిపారు. ప్రజలు సోషల్ మీడియాను బాధ్యతతో వినియోగించుకోవాలని సూచించారు.

వేద న్యూస్

మంగళవారం ఏప్రిల్ 07, 2026

# జీడబ్ల్యూఎంసీకి రూ.3 లక్షల విరాళం అందజేసిన కార్పొరేటర్



**వేద న్యూస్, మడికొండ :**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాజీపేట 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికా రెడ్డి తన వేతనం నుండి రూ.3 లక్షల చెక్కును జీడబ్ల్యూఎంసీకి విరాళంగా అందజేశారు. సోమవారం హనుమకొండ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో, హనుమకొండ కలెక్టర్ మరియు జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పేయికి ఈ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా నగర అభివృద్ధి పనులకు ఈ నిధులను వినియోగించాలని, ముఖ్యంగా కాకతీయుల కాలంనాటి మడికొండలో ఉన్న శిథిలావస్థలో ఉన్న పురాతన బురుజును పునరుద్ధరించేందుకు ఉపయోగించాలని కోరారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మడికొండ చౌరస్తాలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

**వేద న్యూస్, మడికొండ :**



భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవాన్ని మడికొండ చౌరస్తాలో స్థానిక బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే, మాజీ మేయర్ తక్కళ్లపల్లి రాజేశ్వర్ రావు హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1980 ఏప్రిల్ 6న పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ, డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ, అటల్ బిహారీ వాజ్పేయి వంటి మహనీయుల మార్గదర్శకత్వంలో బీజేపీ స్థాపించబడిందని గుర్తు చేశారు. "అంత్యోదయ" సిద్ధాంతంతో చివరి వ్యక్తికి ప్రభుత్వ ఫలాలు అందించడమే పార్టీ లక్ష్యమని తెలిపారు. తెలంగాణలో గత ప్రభుత్వాలు ప్రజల ఆశలు నెరవేర్చడంలో విఫలమయ్యాయని, బీజేపీ ద్వారానే అభివృద్ధి సాధ్యమని ప్రజలు విశ్వసిస్తున్నారని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో పార్టీని విజయపథంలో నడిపించేందుకు కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో-కన్వీనర్ పొనగోటి వెంకట్ రావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం మహేందర్, మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం, సీనియర్ నాయకులు తౌటిరెడ్డి రవీందర్ రెడ్డి, పుల్యాల రవీందర్ రెడ్డి, పెట్టం సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# జన చైతన్యమే వేదిక లక్ష్యం

**- జేవీవీ జిల్లా కన్వీనర్ రామరాజు**



**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం వెంకట్రావుపల్లి గ్రామంలో జనవిజ్ఞాన వేదిక (జేవివి) కార్యకలాపాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విశ్రాంత అధికారి, జనవిజ్ఞాన వేదిక ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్ సి. రామరాజు మాట్లాడుతూ.. జేవివి ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు కృషి చేసే ప్రజా సైన్స్ సంస్థగా కొనసాగుతోందన్నారు. మత స్వేచ్ఛను గౌరవిస్తూ జీవించే హక్కును అత్యున్నతంగా భావిస్తూ, మూఢనమ్మకాల పేరుతో ప్రజలను మోసం చేసే చర్యలను ప్రశ్నించడం సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. దేశవ్యాప్తంగా ఇలాంటి సంస్థలతో కలిసి "ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్" ద్వారా శాస్త్ర విజ్ఞాన ప్రచారం కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల రాజకీయాలకు దూరంగా ఉండి, ప్రజల్లో శాస్త్రీయ అవగాహన కల్పించడం, పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణ, విద్యా అభివృద్ధి వంటి అంశాలపై సంస్థ పనిచేస్తోందన్నారు. 1988లో స్థాపితమైన జేవివి, 2005లో జాతీయ స్థాయి పురస్కారం అందుకున్నదని తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించేందుకు చెకుముకి పోటీలు నిర్వహించడం, ప్రజా సమస్యలపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. ప్రస్తుత కాలంలో మూఢనమ్మకాలు పెరుగుతున్న నేపథ్యంలో, జేవివి వంటి సంస్థలు మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని సి. రామరాజు అభిప్రాయపడ్డారు.

# అనారోగ్య బాధితుడికి ఎల్ఓసీ మంజూరు

**- త్వరిత స్పందనతో సహాయం చేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**వేద న్యూస్, వేములవాడ రూరల్:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం బాలరాజుపల్లి గ్రామానికి చెందిన ఏశ మల్లేశం తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ అత్యవసర చికిత్స అవసరమైందని తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తక్షణమే స్పందించారు. నిమ్స్ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి బాధితుడికి ప్రత్యేక వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రభుత్వం తరఫున రూ. 2,05,000 విలువ గల ఎల్ఓసి (లెటర్ ఆఫ్ క్రెడిట్)ను వైద్య ఖర్చుల కోసం వెంటనే మంజూరు చేయించారు. ఈ సహాయం అందడంతో బాధిత కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# రామ.. రామ..

- అపర భద్రాద్రిలో గిట్లనా ఏర్పాట్లు?
- భక్తుల పెదవి విరుపు!
- ఇల్లందకుంట ఆలయంలో అసౌకర్యాల పరంపర
- పనిచేయని ఫ్యాన్లు, దోమల బెడదతో జనం ఆవేదన
- కోనేరు వద్ద స్నానానికి తగిన ఏర్పాట్లు లేవు
- ఫోటోలకు ప్రాధాన్యము.. సమస్యలపై నిర్లక్ష్యం



**వేద న్యూస్, ఇల్లందకుంట:**

అపర భద్రాద్రి గా పేరు గాంచిన ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి దేవస్థానానికి దర్శనానికి వచ్చే భక్తులకు సమస్యలే స్వాగతం పలుకుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలయం వద్ద ఏర్పాట్లు సరిగా లేకపోవడంతో పెదవి విరుస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి రాత్రివేళ ఆలయ ప్రాంగణంలో విశ్రాంతి కోసం వచ్చే భక్తులకు ఏర్పాటు చేసిన రేకుల షెడ్లలో ఫ్యాన్లు పనిచేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వేడి, దోమల బెడద కారణంగా







నిద్రపోవడం కష్టంగా మారిందని తెలిపారు. మంచినీటి విషయంలో కూడా నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని భక్తులు ఆరోపిస్తున్నారు. ప్రాంగణంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఉన్నప్పటికీ, బావి నీటినే పైపుల ద్వారా సరఫరా చేస్తున్నారని, దీని వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్నానానికి వెళ్లే భక్తులకు కోనేరు వద్ద తగిన సౌకర్యాలు లేకపోవడం, నీటి ట్యాంకులు, నల్లాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని మండిపడ్డారు. బ్రహ్మోత్సవాల అనంతరం మొక్కులు చెల్లించేందుకు వచ్చే భక్తులకు వంట చేసుకునే, పాత్రలు కడుక్కునే నీటి సౌకర్యం కూడా లేకపోవడం పరిస్థితిని మరింత దిగజార్చింది. ఉత్సవాల సమయంలో అధికారులు, పాలకమండలి భక్తుల సమస్యల కంటే ఫోటోలకు ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ఆలయ పరిసరాల్లో శుభ్రత ఏది?**

భక్తులు పడేసిన చెత్తను ప్రతిరోజూ శుభ్రం చేయకపోవడంతో పరిసర ప్రాంతాల్లో దుర్వాసన వ్యాపిస్తున్నదని తెలిపారు. రానున్న భక్తులకు ఇవే సమస్యలు మళ్లీ మళ్లీ పునరావృతం కాకుండా ఉండే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

# నేతన్నల పక్షపాతిగా కాంగ్రెస్ ప్రభుత్వం




**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల :**

**- విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సహకారం**
**- సిరిసిల్ల పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్**

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతూ ప్రభుత్వం పరిశ్రమకు అండగా నిలిచిందని సిరిసిల్ల పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆడెపు భాస్కర్ తెలిపారు. సోమవారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇటీవల ఎస్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి పరిశ్రమ ప్రతినిధులతో జరిపిన సమావేశం సానుకూల ఫలితాలు ఇచ్చిందన్నారు. ముఖ్యంగా బ్యాక్ బిల్లు సమస్యకు పరిష్కారం లభించడంతో పరిశ్రమపై భారము తగ్గిందని చెప్పారు. మూడో కేటగిరీలోకి మార్చిన విద్యుత్ మీటర్లను తిరిగి నాలుగో కేటగిరీలోకి మార్చడం వల్ల పరిశ్రమకు గణనీయమైన లాభం చేకూరుతుందని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం, ఎస్పీడీసీఎల్ తీసుకున్న నిర్ణయాలకు మద్దతుగా మంగళవారం సిరిసిల్లలోని నేతన్న విగ్రహం వద్ద పాలాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అంకారపు రవి, సభ్యులు కళ్యాణపు సుభాష్, దూడం శంకర్, గోవింద్ రవి, మండల సత్యం, బొద్దుల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# పందుల ఫామ్ సెగతో అల్లాడుతున్న పల్లె..!

**- దుర్వాసనతో ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి..**
**- చిన్నారుల ఆరోగ్యంపై 'స్వైన్ ఫ్లూ' నీడ!**



**వేద న్యూస్,సింగరేణి:**

నివాస ప్రాంతాల మధ్య పందుల పెంపకమా? లేక ప్రజల ప్రాణాలతో చెలగాటమా? సింగరేణి మండలం గుంపెళ్ళ గూడెం గ్రామస్తులు ఇప్పుడు ఇదే ప్రశ్నను అధికారుల ముందు ఉంచుతున్నారు. ఊరి నడిబొడ్డున వెలసిన పందుల ఫామ్ నుండి వెలువడుతున్న భరించలేని దుర్వాసనతో గ్రామం అతలాకుతలమవుతోంది. అధికారుల నిర్లక్ష్యం, ఫామ్ నిర్వాహకుల మొండివైఖరి వెరసి.. గుంపెళ్ళ గూడెం నేడు అంటువ్యాధుల నిలయంగా మారుతోంది.

**వ్యాధుల గుప్పిట్లో బాల్యం.. తల్లిదండ్రుల కన్నీరు!**

గ్రామంలో పరిస్థితి అత్యంత దారుణంగా తయారైంది. పందుల ఫామ్ నుండి వచ్చే వ్యర్థాలు, మలమూత్రాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటంతో గాలి విషతుల్యమవుతోంది. దీని ప్రభావం నేరుగా చిన్నారులపై పడుతోంది. చర్మ వ్యాధులు, గజ్జి, తామర వంటి సమస్యలతో చిన్న పిల్లలు విలవిలలాడుతున్నారు. తీవ్రమైన జ్వరం, దగ్గుతో ఆసుపత్రుల పాలవుతున్న చిన్నారుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ముఖ్యంగా గాలి ద్వారా వ్యాపించే వైరల్ జ్వరాలు, ప్రమాదకరమైన 'స్వైన్ ఫ్లూ' ఎక్కడ గ్రామాన్ని చుట్టుముడుతుందోనని ప్రజలు గుండె అరచేతిలో పెట్టుకుని బతుకుతున్నారు.

**"చర్యలు తీసుకోకపోతే సహించేది లేదు"**

గ్రామస్తుల ఆవేదనపై గ్రామ సర్పంచ్ గుగులోతు కృష్ణవేణి, గ్రామ పెద్ద వీరబాబు, పంచాయతీ కార్యదర్శి ఉప సర్పంచ్ శంకర్ తీవ్రంగా స్పందించారు. "ప్రజల ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టి వ్యాపారం చేస్తామంటే ఊరుకోం. ఫామ్ నిర్వహణలో కనీస నిబంధనలు పాటించడం లేదు. వెంటనే ఈ పందుల ఫామ్‌ను గ్రామానికి దూరంగా తరలించాల్సిందే" అని వారు డిమాండ్ చేశారు. గ్రామస్థులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఉన్నతాధికారుల్లో చలనం లేకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల ఆరోగ్యం కంటే వ్యాపార ప్రయోజనాలే ముఖ్యమా? అని బాధితులు ప్రశ్నిస్తున్నారు. వెంటనే ఆరోగ్య శాఖాధికారులు, కాలుష్య నియంత్రణ మండలి స్పందించి తనిఖీలు చేపట్టాలి. ఒకవేళ అధికారులు స్పందించని పక్షంలో గ్రామస్థులందరినీ ఏకం చేసి జిల్లా వ్యాప్త ఉద్యమానికి పిలుపునిస్తామని గ్రామ నాయకులు హెచ్చరిస్తున్నారు. అంటువ్యాధులు ప్రబలి ప్రాణనష్టం జరగకముందే ప్రభుత్వం మేల్కోవాలి. గుంపెళ్ళ గూడెం ప్రజలకు స్వచ్ఛమైన గాలిని, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాల్సిన బాధ్యత యంత్రాంగంపై ఉంది.



వేద న్యూస్



# ఎన్‌హెచ్-563 పనుల్లో అవినీతి ఆరోపణలు



- ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు

**వేద న్యూస్, జగిత్యాల:**

నిజామాబాద్ నుంచి వరంగల్ వరకు కొనసాగుతున్న జాతీయ రహదారి ఎన్‌హెచ్-563 పనుల్లో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) కోడిమ్యాల మండల అధ్యక్షుడు డి. అరుణ్ రాజ్ జిల్లా అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఈ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అరుణ్ రాజ్ మాట్లాడుతూ.. రహదారి విస్తరణ పేరుతో రైతులు తమ భూములను కోల్పోయి తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు రైతులను మరింత ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ప్రత్యేకంగా కోడిమ్యాల తహసీల్దార్‌పై తీవ్ర ఆరోపణలు చేస్తూ, 'కమిషన్ ఇవ్వకపోతే పనులు జరగవు, లేకపోతే నష్టపోతారు' అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. అలాగే, సంబంధిత ఎమ్మార్వోకు బదిలీ ఉత్తర్వులు వచ్చినప్పటికీ ఇంకా అదే స్థానంలో కొనసాగుతుండటం అనుమానాలకు తావిస్తున్నదని తెలిపారు. ఉన్నతాధికారుల అనుమతితోనా? లేక ఇతర కారణాల వల్లనా కొనసాగుతున్నారో అనేది విచారణలో తేలాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో బాధిత రైతులకు న్యాయం చేయడంతో పాటు సంబంధిత అధికారిపై తక్షణ విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని టీఆర్‌పీ నాయకులు కలెక్టర్‌ను కోరారు.

# ప్రజావాణికి దరఖాస్తుల వెల్లువ



- వినతులు స్వీకరించిన అదనపు కలెక్టర్
- పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 253 దరఖాస్తులు అందాయి. వీటిలో రెవెన్యూ శాఖకు 67, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖకు 64, హౌసింగ్ శాఖకు 46, జిల్లా పంచాయతీ అధికారికి 13, జిల్లా ఉపాధి కల్పనాధికారికి 9, జిల్లా విద్యాశాఖకు 6, జిల్లా సంక్షేమ శాఖకు 5 దరఖాస్తులు అందాయి. అదేవిధంగా నీటి పారుదల, సెస్, ఎస్డీసీ, పంచాయతీరాజ్ శాఖలకు నాలుగు చొప్పున, పౌర సరఫరాలు, వైద్య శాఖ, మున్సిపల్ కమిషనర్ (సిరిసిల్ల)కు మూడు చొప్పున, అటవీ శాఖ, సబ్ రిజిస్ట్రార్, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి రెండు చొప్పున దరఖాస్తులు అందాయి. మిగతా శాఖలకు ఒక్కొక్కటి చొప్పున దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. అన్ని అర్జీలను సంబంధిత శాఖలకు పంపించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, హౌసింగ్ పీడీ వెంకట మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదానం

**వేద న్యూస్, రుద్రూర్ :**

రుద్రూర్ మండల కేంద్రంలోని జేయన్సీ కాలనీలో గల శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో సోమవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇందూరి సునీత చంద్రశేఖర్, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# బూజు పట్టిన మండల సమికృత కార్యాలయం..!




- పరిశుభ్రతపై అధికారుల నిర్లక్ష్యం
- కార్యాలయంలో త్రాగు నీటి సదుపాయం కరువు

**వేద న్యూస్, రుద్రూర్ :**

హవ్వ నవ్విపోదురు గాక మన ఇంట్లో, ఇంటి చుట్టూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటాం కానీ రుద్రూర్ మండల కేంద్రంలోని సమికృత మండల సముదాయ భవన కార్యాలయం మొత్తం బూజు పట్టి ఉండడంతో కార్యాలయానికి వచ్చిన వారు పలు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. పరిశుభ్రత ఎక్కడ ఉందని పలువురు నివ్వేరపోతున్నారు. కార్యాలయానికి మొత్తం బూజు పట్టిన కూడా అధికారులు తమకేమీలే అన్నచందంగా నిర్లక్ష్యంగా వ్యవహారిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి సమికృత మండల భవన కార్యాలయాన్ని శుభ్రపర్చాలని కార్యాలయానికి వచ్చిన ప్రజలు కోరుతున్నారు.

**కార్యాలయంలో త్రాగునీటి సదుపాయం కరువు...!**



రుద్రూర్ మండల కేంద్రంలోని సమీకృత మండల సముదాయ కార్యాలయంలో కనీసం త్రాగునీరు కూడా లేకపోవడంతో కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు తమ దాహార్తిని తీర్చుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. అసలే వేసవికాలం కావడంతో కార్యాలయంలో తప్పనిసరిగా త్రాగునీరు అందుబాటులో ఉంచాలి. కానీ త్రాగునీరు లేకపోవడంతో కార్యాలయానికి వచ్చిన ప్రజలు విమర్శించుకుంటున్నారు.

# గర్భాశయ క్యాన్సర్ నివారణకు హెచ్పీవీ వ్యాక్సిన్ కీలకం

- మెడికల్ ఆఫీసర్ డా. శివాని - పీహెచ్సీలో వ్యాక్సినేషన్ ప్రారంభం



**వేద న్యూస్, మెట్‌పల్లి:**

జగిత్యాల జిల్లా జగ్గాసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని గ్రామ ఉప సర్పంచ్ లక్మ చిన్నయ్య చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా. నరేంద్ర, మెడికల్ ఆఫీసర్ డా. తాటిపర్తి శివాని మాట్లాడుతూ.. గర్భాశయ క్యాన్సర్ నివారణలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ వ్యాక్సిన్ ద్వారా భవిష్యత్తులో క్యాన్సర్ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చని వివరించారు. గ్రామ ప్రజలు తమ కుమార్తెలకు తప్పనిసరిగా ఈ వ్యాక్సిన్ వేయించేందుకు ముందుకు రావాలని సూచించారు. జగ్గాసాగర్ పీహెచ్‌సీ పరిధిలోని అర్హత కలిగిన బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందించేందుకు ఆరోగ్య శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, ఆరోగ్య సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# రామలింగేశ్వర స్వామి విగ్రహ పునః ప్రతిష్ఠా మహోత్సవం

**వేద న్యూస్, గంభీరావుపేట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం గజసింగవరం గ్రామంలో శ్రీ రామలింగేశ్వర స్వామి పునర్ ప్రతిష్ట మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నాఫ్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు ఆధ్వర్యంలో ఘనంగా చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీ రామలింగేశ్వర స్వామి పునర్ ప్రతిష్టతో పాటు శ్రీ సీతారాముల, వెంకటేశ్వర స్వామి, ఆంజనేయ స్వామి, నవగ్రహ విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. ఈ మహోత్సవానికి మాజీ పార్లమెంట్ సభ్యులు బోయినపల్లి వినోద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అలాగే రాజన్న సిరిసిల్ల జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తోట ఆగన్న, సీనియర్ నాయకులు చీటీ నరసింహారావు, కృష్ణారెడ్డి, లక్ష్మణరావు, నాగరాజు లక్ష్మణ్ తదితరులు హాజరయ్యారు. పూజా కార్యక్రమాల అనంతరం నాయకులు తీర్థప్రసాదాలు స్వీకరించి, అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని మహోత్సవాన్ని విజయవంతం చేశారు. ఈ పునర్ ప్రతిష్ట మహోత్సవం గ్రామ ప్రజల ఐక్యతకు, భక్తి భావానికి నిదర్శనంగా నిలిచింది.

# పాత కేసు ఉపసంహరించుకోవాలంటూ దాడి

**వేద న్యూస్, బోయినిపల్లి:**

- నిందితుడి అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం జగ్గారావుపల్లి గ్రామంలో పాత కేసు ఉపసంహరించుకోవాలంటూ వ్యక్తిపై దాడి చేసిన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం, గత సంవత్సరం వినాయక చవితి సందర్భంగా జరిగిన గొడవలో బొజ్జ ధర్మయ్య అలియాస్ ధర్మేందర్‌పై కేసు నమోదు అయింది. ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న ధర్మయ్య, శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో పొన్నం రాజు ఇంటికి వెళ్లి పాత కేసు ఉపసంహరించుకోవాలని ఒత్తిడి చేశాడు. ఈ సందర్భంగా బీర్ సీసాతో దాడి చేసి పొన్నం రాజును గాయపరిచాడు. అడ్డుకునేందుకు వచ్చిన అతని కుమార్తెపై కూడా దాడి చేసి దుర్భాషలాడినట్లు పోలీసులు తెలిపారు. పొన్నం రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు, సోమవారం నిందితుడు బొజ్జ ధర్మయ్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు బోయినిపల్లి ఎస్సై రమాకాంత్ తెలిపారు.

# 47వ భారతీయ జనతా పార్టీ ఆవిర్భవ దినోత్సవ వేడుకలు

**వేద న్యూస్, రుద్రూర్ :**



రుద్రూర్ మండల కేంద్రంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఆలపాటి హరికృష్ణ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారసత్వ రాజకీయాలు తమ పార్టీలో ఉండవన్నారు. కష్టపడిన కార్యకర్తలను కడుపున పెట్టుకునే ఏకైక పార్టీ బీజేపి పార్టీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో రుద్రూర్ మండల ప్రధాన కార్యదర్శి ఏముల గజేందర్, వడ్ల సాయినాథ్, మండల సీనియర్ నాయకులు తోటశంకర్, కటికె రామరాజు, బోజిగొండ అనిల్, పార్వతి మురళి, చిదురా మహిపాల్, బేగరి శివప్రసాద్, కుర్లెపు గంగాధర్, రేపల్లి సాయిప్రసాద్, ధర్మవరం వెంకటేష్, శ్రీనివాస్, తెల్ల రవి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- ఎస్సై సాయన్న



**వేద న్యూస్, రుద్రూర్ :**

రుద్రూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో సోమవారం మాదకద్రవ్యాల నిర్మూలన పై విద్యార్థినీలకు ఎస్సై సాయన్న అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై సాయన్న మాట్లాడుతూ.. డ్రగ్స్ యువత జీవితాన్ని నాశనం చేస్తాయని మత్తుకు బానిసలైతే నేరాలు, ఆకృత్యాలకు దారి తీస్తాయని అన్నారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్యామల, పాఠశాల బృందం, పోలీసు బృందం, విద్యార్థినీలు పాల్గొన్నారు.

# రైతులు దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దు

- తహసీల్దార్ గంగాధర్



**వేద న్యూస్, కోటగిరి :**

రైతులు దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పటు చేసిన కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని తహసీల్దార్ కే. గంగాధర్ పేర్కొన్నారు. సోమవారం కోటగిరి ప్రాథమిక సహకార సంఘం గోదాం ఆవరణలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ కే. గంగాధర్ మండల ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏ. గ్రేడ్ రకానికి రూ. 2389, బి.గ్రేడ్ రకానికి రూ. 2369 క్వింటలుకు మద్దతు ధర అందించి కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు సహకరించి వరుస క్రమంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ హన్మంత్, వైస్ ఛైర్మన్ అనిల్ కులకర్ణి, సర్పంచ్ బర్ల మధుకర్, మాజీ విండో చైర్మన్ కుచి సిద్దు, మాజీ ఎంపీటీసీ కొట్టం మనోహర్, ఏ.ఈ.ఓ అస్మా, సొసైటీ కార్యదర్శి విఠల్, వార్డ్ మెంబర్లు కన్నం శ్రీనివాస్, మాజీ డైరెక్టర్ శ్రీనివాస్, నాయకులు బీర్కూర్ గంగాధర్, మోహన్ రావు, కుచి శ్రీనివాస్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

మంగళవారం ఏప్రిల్ 07, 2026

## ముత్యాలమ్మ ఆలయ పునర్నిర్మాణానికి అంకురార్పణ

- శంకుస్థాపన చేసిన తుంబూరు దయాకర్ రెడ్డి
- కైకొండాయిగూడెంలో ఆధ్యాత్మిక కోలాహలం



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి :**

ఖమ్మం నగరం ఒకటో డివిజన్ కైకొండాయిగూడెంలో వెలిసిన ముత్యాలమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణ పనులకు సోమవారం ఘనంగా శ్రీకారం చుట్టారు. తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు.

**శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు**

ప్రముఖ వేద పండితుడు బాదంపూడి రామలింగేశ్వర శర్మ పర్యవేక్షణలో గణపతి పూజ, పుణ్యాహవాచనం తదితర క్రతువులను వేద మంత్రోచ్ఛారణల మధ్య నిర్వహించారు. ఆలయ పునర్నిర్మాణం నిర్విఘ్నంగా పూర్తి కావాలని, ఈ ప్రాంత ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని పురోహితులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి దయాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నాగటి శ్రీను, నాగటి ఉపేందర్, తుళ్లూరి మాధవరావు – కోటేశ్వరి దంపతులు, మద్దినేని ప్రసాద్, ఆళ్ల రమేష్, గద్దల నాగేశ్వరరావు, గద్దల చిన్నప్ప, తుళ్లూరి కృష్ణయ్య, కొల్లు వెంకటేశ్వర్లు, పందుల తిరుపతిరావు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం భక్తులందరికీ తీర్థప్రసాద వితరణ జరిగింది.

## గ్రామ అభివృద్ధికి బాటలు

- చీమలవారిగూడెంలో సీసీ రోడ్ల శంకుస్థాపన



**వేద న్యూస్, కారేపల్లి :**

గ్రామాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రేగులగూడెం గ్రామపంచాయతీలో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయి. సోమవారం మండల కేంద్రంలోని చీమలవారిగూడెం – రొట్టెమాకు రేవు పరిధిలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్లకు సర్పంచ్ ఈసం మోతే వీరస్వామి, జిల్లా కాంగ్రెస్ నాయకులు మాజీ దేవస్థానం చైర్మన్ అడ్డగోడ ఐలయ్య ఘనంగా శంకుస్థాపన చేశారు.

**అభివృద్ధికి భారీగా నిధులు**

ఈ సందర్భంగా సర్పంచ్ వీరస్వామి మాట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, స్థానిక శాసనసభ్యులు శ్రీ మాలోతు రాందాస్ నాయక్ నాయక్ పార్లమెంట్ సభ్యులు శ్రీ రామస్వామి రఘురాం రెడ్డి సహకారంతో గ్రామానికి భారీగా నిధులు మంజూరయ్యాయని తెలిపారు. సుమారు 20 లక్షల రూపాయల వ్యయంతో చీమలవారిగూడెం పరిధిలో రహదారుల నిర్మాణం చేపట్టడం జరుగుతోంది. కారేపల్లి గేటు నుండి అనంతరం వరకు సుమారు కోటి 20 లక్షల రూపాయల అంచనా వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు వారు వెల్లడించారు. శివారు ప్రాంతాల ప్రజలకు సైతం మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు మేము కట్టుబడి ఉన్నామన్నారు. జిల్లా నాయకులు అడ్డగోడ ఐలయ్య మాట్లాడుతూ.. ఎమ్మెల్యే నాయకత్వంలో మిగిలిన శివారు గ్రామాలకు కూడా త్వరలోనే నిధులు కేటాయించి, అంతర్గత రహదారులన్నింటినీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే గ్రామంలోని సైడ్ డ్రైనేజీల సమస్యను కూడా త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే గారికి విన్నవించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అభివృద్ధి పనుల పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## కంచర్లలో 'ఉపాధి' పనులకు శ్రీకారం

- ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలి : సర్పంచ్



**వేద న్యూస్, వీర్నపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామంలో ఉపాధి హామీ పనులను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ సామల్ల దేవరాజ్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ సామల్ల దేవరాజ్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన 125 రోజుల ఉపాధి పథకాన్ని గ్రామంలోని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామ అభివృద్ధికి ఉపాధి హామీ పనులు కీలకమని, నిరుద్యోగులకు ఇది మంచి అవకాశమని తెలిపారు. గ్రామంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు ప్రజలకు ఉపాధి కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమం గ్రామ అభివృద్ధి దిశగా మరో ముందడుగుగా నిలిచింది.

## హైమాస్ట్ లైట్ మంజూరు చేసిన వైరా ఎమ్మెల్యే

- కృతజ్ఞతలు తెలిపిన సర్పంచ్ వరలక్ష్మి రాజు



**వేద న్యూస్, కారేపల్లి :**

మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామ అభివృద్ధికి మరో ముందడుగు పడింది. గ్రామంలోని ప్రధాన కూడలిలో నెలకొన్న చీకట్లను పారద్రోలి, వెలుగులు నింపేందుకు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, హైమాస్ట్ వీధి దీపాన్ని మంజూరు చేశారు. ఈ మంజూరీలో భాగంగా, సోమవారం నాడు సంబంధిత పర్యవేక్షకులు గ్రామాన్ని సందర్శించి, హైమాస్ట్ లైట్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని పరిశీలించి ఖరారు చేశారు. **ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన సర్పంచ్** ఈ సందర్భంగా ఉసిరికాయలపల్లి గ్రామ సర్పంచ్ గుగులోత్ వరలక్ష్మి రాజు మాట్లాడుతూ.. గ్రామంపై ప్రత్యేక మక్కువతో, అడగగానే నిధులు మంజూరు చేసి హైమాస్ట్ లైట్ కేటాయించిన ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ కి గ్రామస్తుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ లైట్ల ఏర్పాటుతో రాత్రి వేళల్లో ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. "ప్రజల అవసరాలను గుర్తించి తక్షణమే స్పందించే మన ఎమ్మెల్యే నాయకత్వంలో గ్రామం మరిన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ నిరంజన్, జగ్గయ్య, శంకర్, సాంబ మరియు ఇతర గ్రామస్తులు, అధికారులు పాల్గొన్నారు

## ప్రజావాణిలో రైతుల సమస్యలకు పరిష్కార దిశగా అడుగులు

- సర్పంచ్ చొరవ ఫలితం



**వేద న్యూస్,కారేపల్లి:**

సింగరేణి మండల ఎమ్మార్వో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో గాదెపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్ చొరవతో కీలక సమస్యలు అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. మడంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఆర్వోఎఫ్ఆర్ రైతుల భూముల్లో 11 కేవీ విద్యుత్ తీగల ఏర్పాటు విషయంలో ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న అంశాన్ని ఎమ్మార్వో దృష్టికి వివరంగా వెల్లడించారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని సర్పంచ్ అభ్యర్థించారు. దీనిపై స్పందించిన ఎమ్మార్వో, సంబంధిత ఫారెస్ట్ రేంజ్ అధికారికి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అదే సమయంలో గాదెపాడు గ్రామపంచాయతీ పరిధిలో నివాస ప్రాంతానికి దగ్గరగా ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలను పక్కకు మార్చాల్సిన అవసరాన్ని కూడా సర్పంచ్ ప్రస్తావించారు. దీనిపై విద్యుత్ శాఖ ఏఈకు సూచనలు ఇవ్వగా, ఉన్నతాధికారులతో సంప్రదించి వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ లభించింది. గ్రామ ప్రజల సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కార దిశగా కృషి చేస్తున్న సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్ సేవలను గ్రామస్తులు ప్రశంసిస్తున్నారు.

## సెలవుపై రాజన్న ఆలయ ఈఓ రమాదేవి

- అంజానారెడ్డికి ఇన్‌ఛార్జ్ బాధ్యతలు



**వేద న్యూస్, వేములవాడ:**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఈఓ రమాదేవి సెలవుపై వెళ్లారు. ఆమె స్థానంలో కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయ ఈఓ అంజానారెడ్డికి వేములవాడ ఆలయ ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఇటీవలే వేములవాడ ఆలయ ఈఓగా పనిచేయడానికి ఆసక్తి వ్యక్తం చేసి బాధ్యతలు స్వీకరించిన రమాదేవి ఆకస్మికంగా సెలవుపై వెళ్లడం స్థానికంగా చర్చకు దారి తీసింది. ఆలయంలో అభివృద్ధి పనులు జరుగుతున్న సమయంలో ఈ నిర్ణయం తీసుకోవడం వెనుక కారణాలపై వివిధ ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. మరో ప్రముఖ ఆలయాల్లో సాధారణంగా అదే ప్రాంతంలో పనిచేస్తున్న అధికారులకు ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగిస్తుండగా, వేములవాడలో ఇతర ఆలయ ఈఓకు బాధ్యతలు అప్పగించడం కూడా చర్చనీయాంశంగా మారింది. స్థానిక పరిస్థితులు, అధికారుల మధ్య సమన్వయ లోపం వంటి కారణాల వల్లే ఈఓ సెలవుపై వెళ్లారనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.

## రోడ్డుపై ప్లాస్టిక్ వ్యర్థాలు..

- రూ.5 వేల జరిమానా
- పారిశుధ్య నిబంధనల ఉల్లంఘనకు చర్యలు



**వేద న్యూస్, సిరిసిల్ల:**

సిరిసిల్ల పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు మున్సిపల్ అధికారులు కఠిన చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో సోమవారం చంద్రంపేట 12వ వార్డులో రోడ్డుపై ప్లాస్టిక్ వ్యర్థాలు పడవేసిన వ్యక్తికి రూ.5వేలు జరిమానా విధించారు. ప్రధాన రహదారులు, నివాస ప్రాంతాల్లో చెత్తను, ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయడం వల్ల ప్రజారోగ్యానికి, పర్యావరణానికి ముప్పు ఏర్పడుతుందని అధికారులు హెచ్చరించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్స్పెక్టర్ కిరణ్ మాట్లాడుతూ, ప్రజలు చెత్తను మున్సిపల్ వాహనాలకే అందించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై భారీ జరిమానాలతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ జవాన్ ప్రవీణ్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**వేద న్యూస్, శంకరపట్నం:**

శంకరపట్నం మండలంలో సోమవారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షులు ఏనుగుల అనిల్ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థాపన నుండి క్రమశిక్షణతో ముందుకు సాగిన బీజేపీ నేడు ప్రపంచంలోనే అతిపెద్ద సభ్యత్వం కలిగిన పార్టీగా ఎదిగిందన్నారు. రాబోయే రోజుల్లో దేశంలోని మిగతా రాష్ట్రాల్లో కూడా పార్టీ విస్తరణ మరింత పెరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దండు కొమురయ్య, నాయకులు జంగా జైపాల్, దొంగల రాములు, దాసారపు నరేందర్, కొయ్యడ అశోక్, రాసమల్ల శ్రీనివాస్, బిజలి సారయ్య, గౌరవేణి శ్రీనివాస్, ఎలుకపెల్లి సంపత్, వడ్లకొండ రాజేందర్, ప్రశాంత్, సాయి, రాజు కుమార్, రవి, రంజిత్, సందీప్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీఐ కమిటీ జిల్లా కార్యదర్శిగా మహేందర్



**వేద న్యూస్, కమలాపూర్:**

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రానికి చెందిన పుల్ల మహేందర్‌ను ఆర్టీఐ సమాచార హక్కు సాధన కమిటీ జిల్లా కార్యదర్శిగా నియమించారు. గత కొంతకాలంగా ప్రజలకు సంబంధించిన సమస్యలపై ఆర్టీఐ చట్టం ద్వారా సమాచారం సేకరించి, వాటి పరిష్కారం కోసం అధికారులతో సంప్రదిస్తూ కృషి చేస్తున్న ఆయన, ఆర్టీఐను సమర్థంగా వినియోగించి అనేక అక్రమాలను వెలుగులోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు. ఈ కృషిని గుర్తించిన కమిటీ జాతీయ అధ్యక్షుడు చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి, హైదరాబాద్‌లోని రవీంద్రభారతి లో నిర్వహించిన ఆర్టీఐ అవగాహన సదస్సులో పుల్ల మహేందర్‌ను జిల్లా కార్యదర్శిగా నియమించారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించినందుకు జాతీయ, రాష్ట్ర నాయకులకు పుల్ల మహేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



**వేద న్యూస్, నల్లబెల్లి:**

నల్లబెల్లి మండల పార్టీ కార్యాలయంలో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మండల అధ్యక్షులు తడుక వినయ్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించగా, బీజేపీ మాజీ జిల్లా కార్యదర్శి తడుక అశోక్ గౌడ్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అశోక్ గౌడ్ మాట్లాడుతూ, సాధారణ కార్యకర్తల శక్తితో ఎదుగుతూ దేశ రాజకీయాల్లో కీలక శక్తిగా అవతరించిన పార్టీ బీజేపీ అని పేర్కొన్నారు. 1980 ఏప్రిల్ 6న స్థాపించబడిన ఈ పార్టీ ప్రారంభ దశలో కేవలం రెండు ఎంపీ స్థానాలతో మొదలై, ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుంటూ క్రమంగా బలపడిందన్నారు. అటల్ బిహారీ వాజపేయి నాయకత్వంలో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసి తన సత్తాను చాటుకున్న బీజేపీ, అనంతరం నరేంద్ర మోదీ నాయకత్వంలో పూర్తి మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి దేశ అభివృద్ధికి కొత్త దిశను చూపుతోందని తెలిపారు. "సబ్కా సాథ్ సబ్కా వికాస్ సబ్కా విశ్వాస్" అనే సిద్ధాంతంతో అన్ని వర్గాల అభ్యున్నతిని లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో రంగాపురం గ్రామ సర్పంచ్ ఓరుగంటి మాధురి రాజు, మండల ప్రధాన కార్యదర్శి ఈర్ల నాగరాజు, ఉపాధ్యక్షులు గుర్రపు నరేష్, బత్తిని కుమారస్వామి, మండల కార్యదర్శి ఓదెల అశోక్, కోశాధికారి మురికి మనోహర్, సీనియర్ నాయకులు వల్లే పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

మంగళవారం ఏప్రిల్ 07, 2026

# ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**– వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ఆధ్వర్యంలో**

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**



వరంగల్ జిల్లా ధర్మారంలోని పార్టీ కార్యాలయంలో బిజెపి నాయకులతో కలిసి పార్టీ పతాకాన్ని సగర్వంగా ఆవిష్కరించిన జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్. అనంతరం ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీ, 'దేశమే ప్రథమం' అనే బలమైన సంకల్పంతో పనిచేసే కార్యకర్తలు కలిగిన భారతీయ జనతా పార్టీ 47వ వసంతంలోకి అడుగుపెడుతున్న పర్వదినం సందర్భంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని, దేశవ్యాప్తంగా కోట్లాది కార్యకర్తలు ఉత్సాహంగా జరుపుకుంటున్న పండుగ వేడుక అన్నారు. జాతీయవాదాన్ని నరనరాన నింపుకొని దేశంకోసం, ధర్మం కోసం పార్టీ సిద్ధాంతం కోసం, ప్రాణాలర్పించిన కార్యకర్తలను స్మరించుకుంటూ ప్రపంచంలో అతిపెద్ద పార్టీగా అవతరించేందుకు కృషి సల్పిన బిజెపి నాయకులకు, కార్యకర్తలకు, మద్దతుదారులందరికీ పేరుపేరునా భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. 1980లో పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ, శ్యామ ప్రసాద్ ముఖర్జీ, అటల్ బిహారీ వాజ్ పాయ్ లాంటి మహోన్నత మైన మహనీయుల మార్గదర్శనంలో నడుస్తూ, ఈ దేశంలోని చిట్టచివరి వ్యక్తికి ప్రభుత్వ ఫలాలు అందించాలనే "అంత్యోదయ" లక్ష్యంతో ముందుకు సాగుతున్న ఏకైక జాతీయ వాద, దేశభక్తి కలిగిన పార్టీ భారతీయ జనతా పార్టీ అని, ఈ పార్టీలో పనిచేస్తున్న కార్యకర్తలు అంతా కూడా గర్వంగా ముందుకు నడుస్తున్నారని అన్నారు.ఇదే స్ఫూర్తితో రాబోయే రోజులలో తెలంగాణ రాష్ట్రంలో సైతం బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి, తెలంగాణ ప్రజలు రాష్ట్ర సాధన సమయంలో ఏవైతే కలలు కన్నారో గత 12 ఏళ్లుగా అవన్నీ అందించడంలో రెండు ప్రభుత్వాలు ఫెయిల్ అయ్యాయి. అది బిజెపితోనే సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారు. అందుకే ఇటీవల జరుగుతున్న అన్ని ఎన్నికల్లో బిజెపికి మంచి ఫలితాలు వస్తున్నాయి. ఇదే స్ఫూర్తితో కార్యకర్తల బలంతో నాయకులందరూ ముందుకు వెళ్లి వచ్చే వరంగల్ మేయర్ ఎన్నికల్లో బిజెపిని విజయతీరాలకు చేర్చుతామని సంకల్పంతో ముందుకు సాగుతామన్నారు. మాతృభూమి సేవ, సమర్పణ భావమే బీజేపీ పార్టీ సిద్ధాంతం. 'అంత్యోదయ' లక్ష్యంగా.. 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్' స్ఫూర్తితో 'వికసిత్ భారత్' సాధనకై ఈ ప్రయాణం ఇలాగే అప్రతిహతంగా కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వన్నాల వెంకటరమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జలగం రంజిత్ రావు, రక్తం సతీష్ షా, ఉమ్మడి జిల్లా మాజీ జిల్లా అధ్యక్షులు ఎడ్ల అశోక్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్య దర్శిలు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, రాష్ట్ర నాయకులు మల్లాడి తిరుపతిరెడ్డి, బైరి మురళీ కృష్ణ, మాదిరెడ్డి దేవేందర్ రెడ్డి, మార్టిన్ లూథర్ మరియు జిల్లా పదాధికారులు, నాయకులు, మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

# ఉప్పల్‌లో విద్యుత్ వినియోగదారుల సదస్సు

**– లోకల్ కోర్ట్‌లో సమస్యలు పరిష్కారం**

**వేద న్యూస్, కమలాపూర్:**

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్‌లో మంగళవారం విద్యుత్ వినియోగదారుల కోసం లోకల్ కోర్ట్ ఏర్పాటు చేయనున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్‌పర్సన్ తెలిపారు. వినియోగదారులు తమ సమస్యలను రాతపూర్వకంగా ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు నిర్వహించే ఈ లోకల్ కోర్ట్‌లో సమర్పించవచ్చని తెలిపారు. అందిన ఫిర్యాదులను అధికారులు పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. ఈ లోకల్ కోర్ట్‌లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు, వోల్టేజ్ సమస్యలు, లోపభూయిష్ట మీటర్ల మార్పు, డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ అభివృద్ధి, కొత్త సర్వీసుల మంజూరు, సర్వీసు పేరు మార్పు, అదనపు లోడ్ క్రమబద్ధీకరణ, కేటగిరీ మార్పు, అధిక బిల్లుల సమస్యలు తదితర అంశాలపై ఫిర్యాదులు ఇవ్వవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఫోరం చైర్‌పర్సన్ కోరారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌కు కేసులో ఇద్దరికి జరిమానా

**వేద న్యూస్, శాయంపేట:**

మద్యం సేవించి వాహనాలు నడపడం, న్యూసెన్స్ సృష్టించడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినందుకు ఇద్దరికి జరిమానా విధించినట్లు స్థానిక ఎస్సై పరమేష్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, మండల పరిధిలోని సూర్యనాయక్ తండ గ్రామానికి చెందిన జర్పుల కిరణ్ నాయక్, దామర మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన గోల్కొండ నరేష్‌పై కేసులు నమోదు చేసి, రెండవ అదనపు ఇన్‌చార్జి న్యాయమూర్తి, అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శ్రీవల్లి శైలజ రూ. 20,500 జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్సై పరమేష్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమని, ఇది వ్యక్తిగతంగా మాత్రమే కాకుండా ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు కలిగిస్తుందని హెచ్చరించారు. ట్రాఫిక్ నియమాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

# మహిళా మంత్రులు, ఎంపీ అసలు ఉన్నారా..?

**– తల్లితో పాటు ఇద్దరు చిన్నారుల హత్యపై స్పందించకపోవడం సిగ్గుచేటు సామాజిక కార్యకర్త ఎండీ ఫసీ**

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**



ఇటీవల తల్లితో పాటు ఇద్దరు కూతుర్లు మృతి చెందిన ఘటన ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. విషయం తెలుసు కున్న సామాజిక కార్యకర్త ఎండి ఫసీ సోమవారం మృతుల తల్లిదండ్రులను పరామర్శించి ధైర్యం చెప్పడం జరిగింది. ఈ సందర్భంగా బాధితులతో కలిసి ఆయన మాట్లాడుతూ నిందితుడు అజరుద్దీన్ ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఒక మహిళ, ఇద్దరు ఆడపిల్లలు మరణించిన వరంగల్ జిల్లాకు సంబంధించిన ఇద్దరు మహిళా మంత్రులు, ఎంపీ ఇప్పటివరకు ఈ సమస్యపై స్పందించకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఏది ఏమైనా తెలంగాణ రాష్ట్ర డీజీపీ,రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జరిగిన ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి 40 రోజులలో కోర్టులో చాట్ సీటు దాఖలు చేసి ఫాస్ట్ ట్రాక్కోర్టులో కేసును కొనసాగించి 90 రోజులలో నిందితునికి శిక్ష పడే విధంగా చర్యలు చేపట్టాలి అని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

# పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

**– కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



**వేదన్యూస్, ఖమ్మం ప్రతినిధి :**

విద్యా సంస్థలలో చదివే ప్రతి విద్యార్థికి సంబంధించిన హెల్త్ ప్రొఫైల్ తయారుచేసి హెల్త్ కార్డు రూపొందించే విధంగా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సోమవారం ఖమ్మం రూరల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, పరిసరాలలో తిరుగుతూ మౌళిక సదుపాయాలు, వంటగది పరిశుభ్రత, ఆహార నాణ్యత, నిల్వ విధానాలు, స్టోర్ రూమ్‌లో ఉన్న బియ్యం, పప్పులు, కూరగాయలు, ఇతర సరుకుల సామగ్రిని తనిఖీ చేసి, రికార్డు రిజిష్టర్లను పరిశీలించారు. కామన్ మెనూ ప్రకారం సోమవారం విద్యార్థులకు అందించడానికి సిద్ధం చేస్తున్న అన్నం, కూరలను పరిశీలించారు. పరిసరాలలో నీటి నిల్వలు ఉండకుండా చర్యలు చేపట్టాలని, కావాలసిన ప్రహరీ గోడ, డైనింగ్ హాల్ మరమ్మత్తులకు ప్రతిపాదనలు అందించాలని, మంజూరైన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..

.మండల ప్రత్యేక అధికారులు ప్రతివారం తమ పరిధిలో ఉన్న కేజీబీవీ, గురుకులం, ప్రభుత్వ విద్యా సంస్థలను తనిఖీ చేసి అక్కడ ఉన్న వసతులు, భోజన నాణ్యత పర్యవేక్షించాలని అన్నారు. గురుకులాలు, ప్రభుత్వ విద్యాసంస్థలు, అంగన్వాడి కేంద్రాలలో ఉన్న పిల్లలను ఆర్.బీ.ఎస్.కే. ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించే సమయంలో ప్రతి విద్యార్థికి సంబంధించిన హెల్త్ ప్రొఫైల్ తయారుచేసి డిజిటల్ హెల్త్ కార్డు అందించే దిశగా అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. గురుకులంలో విద్యార్థులకు ఆరోగ్యవంతమైన, రుచికరమైన ఆహారం అందించాలన్నారు. వంట సిబ్బంది అందించే ఆహారంతో మంచి ఆరోగ్యంతో విద్యార్థులు చదువుపై దృష్టి పెడతారని వివరించారు. వంట సిబ్బంది శుభ్రతా ప్రమాణాలు పాటిస్తూ, ప్రభుత్వం అమలు చేసే మెనూ ప్రణాళిక పద్దతులు ద్వారా భోజన నాణ్యతను మరింత మెరుగుపరచాలని స్పష్టం చేశారు.విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందిస్తూ పదవతరగతి పరీక్షలలో వందశాతం ఫలితాలు వచ్చే విధంగా చొరవ చూపాలని, ప్రత్యేక విద్యా క్లాసుల ద్వారా శిక్షణ ఇస్తూ పోటీ ప్రవేశ పరీక్షలకు కూడా విద్యార్థులను సన్నద్ధం చేసి వాటిలో మంచి ర్యాంకు వచ్చే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. పరిసరాలతో పాటు మరుగుదొడ్లు ఎప్పటి కప్పుడు శుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు అవసరమైన వసతులు ఏర్పాటు చేయాలని, అభివృద్ధి పనులకు మంజూరు అయిన నిధులతో కేటాయించిన పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని అన్నారు. ప్రభుత్వం గురుకుల విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందని, వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం చూపితే సహించేది లేదని, తగిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జెండర్ ఈక్విటీ కోఆర్డినేటర్ రూబీ,ఖమ్మం రూరల్ కెజిబివి స్పెషలాఫీసర్ ఆసియా బేగం, విద్యాశాఖ, మున్సిపల్, రెవెన్యూ శాఖ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యశ్రీ అత్యవసర సేవలు ఆపొద్దు

**– ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

**వేద న్యూస్, వనపర్తి:**




ఆరోగ్యశ్రీ పథకం కింద అత్యవసర వైద్య సేవలను ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేయకూడదని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సమావేశానికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తో కలిసి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ఎంసిహెచ్ ఆసుపత్రుల్లో అందిస్తున్న సేవలను వివరించారు. అనంతరం ఎమ్మెల్యే గత ఏడాది కాలంలో నమోదైన ఓపీడీ, ఐపీడీ, రిఫర్ కేసుల వివరాలను ఆరా తీశారు. సూపరింటెండెంట్ వివరాల ప్రకారం, జనవరి 2025 నుండి డిసెంబర్ 2025 వరకు మొత్తం 3.65 లక్షల ఓపీడీ, 33 వేల ఐపీడీ కేసులు నమోదయ్యాయి. నెలకు సగటున 90 నుండి 150 కేసులను మహబూబ్‌నగర్‌కు రిఫర్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, జిల్లా ఆసుపత్రుల్లోనే ఎక్కువ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, రిఫరల్ కేసులు తగ్గించే దిశగా వైద్య సదుపాయాలను మరింత మెరుగుపరచాలని సూచించారు. ముఖ్యంగా పేద ప్రజలకు ఆరోగ్యశ్రీ ద్వారా అత్యవసర చికిత్స అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు.

# అంబేద్కర్ ఉత్సవ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**– అధ్యక్షుడిగా క్రాంతి కుమార్.. కార్యదర్శిగా సుమన్**

**వేద న్యూస్, శాయంపేట:**



మొగ్గం సుమన్ కార్యదర్శి



అధ్యక్షుడు మారపల్లి క్రాంతి కుమార్ అధ్యక్షుడు

శాయంపేట మండలంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఉత్సవ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా మారపల్లి క్రాంతి కుమార్, కార్యదర్శిగా మొగ్గం సుమన్ ఎంపికయ్యారు. ఉపాధ్యక్షులుగా మారపల్లి సుధాకర్, ఖజాంచిగా మారపల్లి విజయ్, సహాయ కార్యదర్శిగా పెంబర్తి భరత్ చంద్రను ఎన్నుకోగా, గౌరవ సభ్యులుగా అంకేశ్వరపు ఐలయ్య, రేణుకుంట్ల సదయ్య, అరికిల్ల దేవయ్య, మారపల్లి మోహన్, కొమ్ముల సతీష్ తదితరులను నియమించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు క్రాంతి కుమార్ మాట్లాడుతూ, శాయంపేట మండల కేంద్రంలో అంబేద్కర్ భవనం నిర్మాణం చేపట్టడం, అంబేద్కర్ భావజాలాన్ని గ్రామాల వరకు విస్తరించడం కమిటీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అలాగే ప్రతి గ్రామంలో అంబేద్కర్ విగ్రహాలు ఏర్పాటు చేయడం, దళిత బహుజన వర్గాలకు న్యాయం జరిగేలా పోరాటాలు నిర్వహించడం, ఏప్రిల్ 14న బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతిని ఘనంగా నిర్వహించడం, చట్టాలపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు.

# మతోన్మాదం, కార్పొరేట్లకు వ్యతిరేకంగా సీపీఐ పోరాటం

**– వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్**

**వేద న్యూస్, వనపర్తి:**




మతోన్మాదం, కార్పొరేట్ శక్తుల నుంచి దేశాన్ని కాపాడేందుకు సిపిఐ నిరంతరం పోరాటం చేస్తోందని వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్ అన్నారు. ఏప్రిల్ 1 నుంచి 10 వరకు నిర్వహిస్తున్న 'ఇంటింటికి సిపిఐ' కార్యక్రమాన్ని వనపర్తి భగత్‌సింగ్ నగర్‌లో ప్రారంభించారు. వృద్ధ నాయకుడు పెంటకాడి కిష్టయ్య రూ.500 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ, సిపిఐ రైతు, కార్మికుల హక్కుల కోసం పోరాడుతూ పలు సంక్షేమాలు సాధించిందన్నారు. బీజేపీ ప్రభుత్వం మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తూ ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. గ్రామస్థాయిలో ప్రజల్లో చైతన్యం కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దేవరకద్రలో ఇసుక మాఫియా ఆగడాలు

**– అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి – టీఆర్పీ జిల్లా యూత్ అధ్యక్షుడి డిమాండ్**

**వేద న్యూస్, వనపర్తి:**



దేవరకద్ర నియోజకవర్గంలో ఇసుక, మట్టి అక్రమ రవాణా అధికంగా జరుగుతోందని తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టిఆర్పి) జిల్లా యూత్ అధ్యక్షుడు జి. రవికుమార్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం వనపర్తి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీకి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. మదనపూర్ మండలంలోని పలు గ్రామాల్లో రాత్రివేళల్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని, ఒక ట్రాక్టర్ ఇసుక రూ.6 వేల నుంచి రూ.10 వేల వరకు విక్రయిస్తున్నారని తెలిపారు. దీంతో సామాన్య ప్రజలకు ఇసుక అందుబాటులో లేక ఇళ్ల నిర్మాణాలు భారంగా మారుతున్నాయని అన్నారు. అక్రమ తవ్వకాలను అరికట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. ఇసుక మాఫియాపై కఠిన చర్యలు తీసుకుని, సాధారణ ప్రజలకు తక్కువ ధరల్లో ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వేద న్యూస్

మంగళవారం ఏప్రిల్ 07, 2026

## ఫ్లాప్స్ తర్వాత రామ్ కొత్త ప్లాన్..

**వేద న్యూస్ డెస్క్:**



టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని వరుస పరాజయాల తర్వాత మళ్లీ బలంగా తిరిగి రావాలని ప్లాన్ చేస్తున్నాడు. ఇటీవల విడుదలైన 'డబుల్ ఇస్మార్ట్', 'ఆంధ్ర కింగ్' సినిమాలు ఆశించిన విజయాన్ని అందుకోకపోవడంతో, తన తదుపరి ప్రాజెక్ట్‌ల ఎంపికలో మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాడు. ఇప్పటి వరకు చేసిన రొటీన్ మాస్ సినిమాలకు భిన్నం గా, కొత్త కథలపై దృష్టి పెట్టిన రామ్‌డ తాజాగా ఓ సెన్సేషనల్ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాలీవుడ్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా ఈ సినిమాను లోకేష్ కనగరాజ్ వద్ద పని చేసిన అసిస్టెంట్ డైరెక్టర్ తెరకెక్కించనున్నాడని సమాచారం. లోకేష్ స్టైల్‌కు ప్రత్యేకమైన ఇంటెన్సిటీ, గ్రిప్పింగ్ స్క్రీన్‌ప్లే ఎలా ఉంటాయో తెలిసిందే. అదే తరహాలో ఈ సినిమాను పవర్‌ఫుల్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా రూపొందించేందుకు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో రామ్‌ను పూర్తిగా కొత్త లుక్‌లో, కొత్త కోణంలో చూపించేందుకు దర్శకుడు ప్రయత్నిస్తున్నాడని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక ఈ ప్రాజెక్ట్‌కు మరో పెద్ద ఆకర్షణ సంగీతం. సౌత్‌లో టాప్ మ్యూజిక్ డైరెక్టర్‌గా దూసుకుపోతున్న అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి సంగీతం అందించనున్నట్లు సమాచారం. రామ్ ఎనర్జీకి అనిరుధ్ మ్యూజిక్ జతకలిస్తే సినిమా పై భారీ హైప్ రావడం ఖాయం అని అభిమానులు భావిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో, అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ఈ సినిమాను తెరకెక్కించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్ట్ రామ్ కెరీర్‌కు టర్నింగ్ పాయింట్ అవుతుందా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. త్వరలోనే ఈ క్రేజీ కాంబినేషన్‌పై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

# థియేటర్‌కు ముందే ఓటీటీ డీల్..

## 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' స్ట్రీమింగ్ ఎప్పుడంటే..?

**వేద న్యూస్ డెస్క్:**




తమిళ యంగ్ స్టార్ ప్రదీప్ రంగనాథన్ హీరోగా, విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' సినిమా రిలీజ్‌కు ముందే ఓటీటీ డీల్ కుదుర్చుకుని హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రంలో కృతి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. ఏప్రిల్ 10న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానున్న ఈ సినిమాపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. 'లవ్ టుడే', 'డ్రాగన్', 'డ్యూడ్' వంటి హిట్స్‌తో మంచి ఫామ్‌లో ఉన్న ప్రదీప్ రంగనాథన్ ఈ మూవీతో మరో సక్సెస్ సాధించాలనే లక్ష్యంతో ఉన్నాడు. ఇప్పటికే థియేట్రికల్ రిలీజ్‌కు ముందే ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియో ఈ సినిమా డిజిటల్ హక్కులను సొంతం చేసుకున్నట్లు సమాచారం. ట్రేడ్ వర్గాల టాక్ ప్రకారం, థియేటర్లలో నాలుగు వారాల రన్ తర్వాత మిడ్ మేలో ఈ సినిమా ఓటీటీలో స్ట్రీమింగ్‌కు వచ్చే అవకాశముంది. ఇక ట్రైలర్ చూస్తుంటే, 2040 నేపథ్యంలో సాగే యూత్‌ఫుల్ లవ్ స్టోరీగా ఈ సినిమా రూపొందినట్లు తెలుస్తోంది. 'లవ్ ఎట్ ఫస్ట్ సైట్' కాన్సెప్ట్‌ను ఫ్యూచర్ సెట్టింగ్‌లో చూపించబోతున్నట్లు హింట్ ఇచ్చారు. డైలాగ్స్, విజువల్స్ యూత్‌ను ఆకట్టుకునేలా ఉండటంతో సినిమాపై క్రేజ్ మరింత పెరిగింది. ఈ చిత్రాన్ని రౌడీ పిక్చర్స్ బ్యానర్‌పై నయనతార నిర్మించగా, ఎస్ఎస్ లలిత్ కుమార్‌తో కలిసి రూపొందిస్తున్నారు. సినిమాలో ఎస్ జే సూర్య, యోగి బాబు, సీమాన్, గౌరీ కిషన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మొత్తానికి థియేటర్ రిలీజ్‌కు ముందే ఓటీటీ డీల్ కుదరడం ఈ సినిమాపై ఉన్న క్రేజ్‌కు నిదర్శనం అని చెప్పాలి. ఇప్పుడు బాక్సాఫీస్ వద్ద ఎలా రాణిస్తుందో, ఓటీటీలో ఎలాంటి రెస్పాన్స్ దక్కించుకుంటుందో చూడాలి.

## వివాదాల మధ్య త్రిష సైలెంట్ రియాక్షన్.. లవ్ కోట్స్ వైరల్

**వేద న్యూస్ డెస్క్:**



సీనియర్ హీరోయిన్ త్రిష కృష్ణన్ ఇటీవల సినిమాల కంటే వ్యక్తిగత విషయాలతోనే వార్తల్లో నిలుస్తున్నారు. ముఖ్యంగా తమిళనాడులో రాజకీయ వాతావరణం వేడెక్కుతున్న సమయంలో, విజయ్ రాజకీయ ప్రవేశం తర్వాత అతడిని లక్ష్యంగా చేసుకుని వస్తున్న విమర్శల్లో త్రిష పేరు కూడా వినిపించడం చర్చనీయాంశంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో కొద్ది రోజులుగా మౌనం పాటించిన త్రిష, తాజాగా సోషల్ మీడియాలో చేసిన పోస్టులతో పరోక్షంగా స్పందించినట్లు కనిపిస్తోంది. తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన వీడియోల్లో "ఇతరుల అభిప్రాయాలను మనం నియంత్రించలేండ మన జీవితాన్ని నిజాయితీగా గడపడం మాత్రమే మన చేతిలో ఉంది" అనే సందేశాన్ని ఇచ్చారు. మరో పోస్టులో "సరిగ్గా ఉండటం కంటే మనశ్శాంతి ముఖ్యండ ప్రతి వాదనకు స్పందించడం అవసరం లేదుడ కొన్ని సందర్భాల్లో మౌనం ఉత్తమ సమాధానం" అనే భావాన్ని వ్యక్తపరిచారు. అలాగే "ప్రేమే సర్వస్వం కాదుడ కానీ ప్రేమ లేకపోతే దేనికీ అర్థం లేదు" అనే కోట్‌ను షేర్ చేస్తూ 'నిజం' అని క్యాప్షన్ ఇచ్చారు. ఈ పోస్టులు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, ఆమె ఈ విధంగా స్పందించడం ప్రస్తుత వివాదాలకు సంబంధించినదేనా అన్న చర్చ మొదలైంది. ఇటీవల విజయ్ వ్యక్తిగత జీవితంపై వచ్చిన ఆరోపణల్లో కూడా ఒక సినీ నటి పేరును లాగడం, అదే సమయంలో విజయ్–త్రిష కలిసి ఓ కార్యక్రమంలో కనిపించడం మరింత చర్చకు దారితీసింది. ఈ వ్యవహారంపై పార్థిబన్ వంటి సినీ ప్రముఖులు కూడా స్పందించడం గమనార్హం. దీంతో త్రిష చేసిన సోషల్ మీడియా పోస్టులకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. ఇక సినిమాల విషయానికి వస్తే, త్రిష ప్రస్తుతం సూర్య సరసన 'కరుప్పు' సినిమాలో నటిస్తోంది. అలాగే చిరంజీవితో కలిసి 'విశ్వంభర' సినిమాలో నటిస్తోంది. ఈ చిత్రాలు విడుదలకు సిద్ధమవుతుండటంతో త్రిష మరోసారి పెద్ద తెరపై సందడి చేయనుంది.

## 'పెద్ది'తో రామ్ చరణ్ సెన్సేషన్




**వేద న్యూస్ డెస్క్:**

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సన దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'పెద్ది' సినిమా రిలీజ్‌కు ముందే టాలీవుడ్‌లో భారీ సంచలనంగా మారింది. గ్రామీణ నేపథ్యంలో రూపొందుతున్న ఈ స్పోర్ట్స్ డ్రామాపై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన ఓటీటీ హక్కుల విషయంలో భారీ డీల్ కుదిరినట్లు సమాచారం. ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ 'పెద్ది' డిజిటల్ హక్కుల కోసం ఏకంగా రూ.130 కోట్ల ఆఫర్ ఇచ్చినట్లు టాక్ వినిపిస్తోంది. అన్ని భాషల హక్కులు కలిపి ఈ డీల్ కుదిరిందని తెలుస్తోంది. ఇంకా ఆసక్తికర విషయం ఏమిటంటే, సినిమా థియేటర్లలో సూపర్ హిట్ అయితే అదనంగా రూ.20 కోట్ల బోనస్ కూడా ఇవ్వాలని ఒప్పందంలో భాగంగా ప్రతిపాదించిందట. దీంతో మొత్తం డీల్ విలువ రూ.150 కోట్ల వరకు చేరే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సంగీతాన్ని ఏ ఆర్ రెహమాన్ అందిస్తున్నారు. ఈ కాంబినేషన్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. 'పెద్ది' సినిమాలో రామ్ చరణ్ 'పెద్ది పహిల్వాన్'గా, అలాగే క్రికెటర్‌గా రెండు విభిన్న పాత్రల్లో కనిపించనున్నాడు. నటన, బాడీ లాంగ్వేజ్ పరంగా ఇది ఆయన కెరీర్‌లో ప్రత్యేకమైన సినిమా అవుతుందని అభిమానులు భావిస్తున్నారు. ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ చిత్రం, థియేటర్లలో నాలుగు వారాల తర్వాత ఓటీటీలో స్ట్రీమింగ్‌కు వచ్చే అవకాశం ఉంది. మొత్తానికి రిలీజ్‌కు ముందే భారీ డీల్‌తో 'పెద్ది' సినిమా ట్రేడ్ వర్గాల్లోనే కాకుండా ప్రేక్షకుల్లోనూ భారీ హైప్ క్రియేట్ చేస్తోంది.

## నిహారిక 'రాకాస' రచ్చ..



**వేద న్యూస్ డెస్క్:**

మెగా డాటర్ నిహారిక కొణిదెల నిర్మాతగా వరుస విజయాలతో దూసుకు పోతున్నారు. తాజాగా ఆమె నిర్మించిన 'రాకాస' సినిమా విడుదలైన మొదటి రోజు నుంచే సూపర్ హిట్ టాక్ సంపాదించి బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధిస్తోంది. ఈ చిత్రాన్ని ఓటీటీ సిరీస్‌లతో గుర్తింపు పొందిన మానస శర్మ తెరకెక్కించారు. ఇందులో సంగీత్ శోభన్ హీరోగా నటించగా, నయన్ సారిక హీరోయిన్‌గా ఆకట్టుకుంది. హారర్, కామెడీ, ఫాంటసీ మేళవింపుతో రూపొందిన ఈ చిత్రంలో వెన్నెల కిషోర్, బ్రహ్మాజీ, గెటప్ శ్రీను, తనికెళ్ల భరణి, ఆశిష్ విద్యార్థి కీలక పాత్రల్లో నటించారు. ఏప్రిల్ 3న గ్రాండ్‌గా విడుదలైన ఈ సినిమా, గ్లింప్స్, టీజర్, ట్రైలర్‌తోనే మంచి అంచనాలు ఏర్పరచుకుంది. విడుదల తర్వాత ఆ అంచనాలను మించి ప్రేక్షకులను అలరిస్తూ తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్సీస్‌లో కూడా మంచి రెస్పాన్స్ అందుకుంటోంది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, 'రాకాస' సినిమా కేవలం రెండు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.10.30 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ సాధించింది. విడుదలైన తొలి 24 గంటల్లోనే 60 వేలకుపైగా టికెట్లు అమ్ముడవడం ఈ సినిమాపై ఉన్న క్రేజ్‌కు నిదర్శనం. ఇప్పటికే 'కమిటీ కుర్రోళ్లు' సినిమాతో నిర్మాతగా బ్లాక్‌బస్టర్ అందుకున్న నిహారిక, 'రాకాస'తో మరో హిట్ తన ఖాతాలో వేసుకున్నట్లు కనిపిస్తోంది. డిఫరెంట్ ప్రమోషన్, కొత్త ట్రీట్మెంట్, కామెడీ టైమింగ్ కలిపి ఈ సినిమాను విజయవంతం చేశాయి. హారర్ కామెడీ జానర్‌ను కొత్తగా ప్రెజెంట్ చేయడంపై ప్రేక్షకులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

## సీరియల్స్ మానేసిన శోభా శెట్టి ఇప్పుడు యూట్యూబ్‌తో లక్షల ఆదాయం!

**వేద న్యూస్ డెస్క్:**



కన్నడ నటి శోభా శెట్టి బిగ్ బాస్ ద్వారా భారీ గుర్తింపు తెచ్చుకుని ఇప్పుడు కొత్త దారిలో దూసుకెళ్తోంది. ఒకప్పుడు సీరియల్స్‌లో బిజీగా ఉన్న ఈ నటి, ప్రస్తుతం డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను ఆదాయ వనరుగా మార్చుకుని సక్సెస్‌ఫుల్‌గా కెరీర్‌ను కొనసాగిస్తోంది. ముఖ్యంగా కార్తీక దీపం సీరియల్‌లో మోనిత పాత్రతో శోభా శెట్టి ప్రేక్షకుల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. ఆ తర్వాత బిగ్ బాస్ తెలుగు సీజన్ 7లో పాల్గొని తన ప్రత్యేక వ్యక్తిత్వంతో మరింత పాపులారిటీ సంపాదించింది. అయితే బిగ్ బాస్ తర్వాత ఆమె సీరియల్స్‌కు పూర్తిగా గుడ్‌బై చెప్పడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. సీరియల్స్‌కు దూరమైనప్పటికీ, ఎంటర్‌టైన్‌మెంట్ రంగాన్ని మాత్రం విడిచిపెట్టలేదు. అప్పుడప్పుడు టీవీ షోలు, ఈవెంట్స్‌లో కనిపిస్తూ అభిమానులను అలరిస్తూనే ఉంది. ముఖ్యంగా సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ, యూట్యూబ్ ఛానెల్ ద్వారా తన అభిమానులతో నిరంతరం కనెక్ట్ అవుతోంది. ఆమె యూట్యూబ్ ఛానెల్‌కు లక్షల్లో సబ్‌స్క్రైబర్లు ఉండగా, ప్రతి వీడియోకు భారీగా వ్యూస్ వస్తున్నాయి. తన వ్యక్తిగత జీవితం, షూటింగ్ అనుభవాలు, ట్రావెల్ వ్లాగ్స్, డైలీ రూటీన్ వంటి విషయాలను పంచుకుంటూ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈ వీడియోలకు మిలియన్లలో వ్యూస్ రావడంతో యూట్యూబ్ ద్వారానే ఆమెకు భారీ ఆదాయం వస్తోందని సమాచారం. ప్రస్తుతం శోభా శెట్టి నెలకు సుమారు రూ.10 లక్షల వరకు సంపాదిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. సీరియల్స్‌ను వదిలేసినా, డిజిటల్ మీడియాను స్మార్ట్‌గా ఉపయోగించుకుని తన కెరీర్‌ను కొత్త స్థాయికి తీసుకెళ్లిన ఉదాహరణగా ఆమె నిలుస్తోంది.

## అనిల్ రావిపూడి సినిమాలో హీరోయిన్ ఫిక్స్..

**వేద న్యూస్ డెస్క్:**



సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి తన తదుపరి భారీ ప్రాజెక్ట్‌పై ఆసక్తికరమైన అప్డేట్ ఇచ్చారు. 2027 సంక్రాంతి కానుకగా వెంకటేశ్, నందమూరి కళ్యాణ్ రామ్ కాంబినేషన్‌లో రూపొందనున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాలో హీరోయిన్ ఎవరు అన్నదానిపై వస్తున్న ఊహాగానాలకు తాజాగా క్లారిటీ ఇచ్చారు అనిల్ రావిపూడి. కృతి శెట్టి ఈ చిత్రంలో ఒక ఫీమేల్ లీడ్‌గా నటించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఆమె నందమూరి కళ్యాణ్ రామ్‌కు జోడీగా కనిపించబోతున్నట్లు తెలిపారు. ఇక వెంకటేశ్ సరసన ఎవరు నటిస్తారు అన్నది మాత్రం ఇంకా సస్పెన్స్‌గా మిగిలింది. రెండో హీరోయిన్ ఎంపికపై త్వరలోనే మరింత క్లారిటీ వచ్చే అవకాశముంది. ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్, జీ స్టూడియోస్ కలిసి నిర్మిస్తుండగా, సురేష్ ప్రొడక్షన్స్ సమర్పిస్తోంది. సంక్రాంతి టార్గెట్‌గా తెరకెక్కుతున్న ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలోనే మేకర్స్ వెల్లడించనున్నారు. మొత్తానికి కృతి శెట్టి ఎంట్రీతో ఈ క్రేజీ మల్టీస్టారర్‌పై మరింత ఆసక్తి పెరిగింది. ఇప్పుడు రెండో హీరోయిన్ ఎవరు అన్నదే హాట్ టాపిక్‌గా మారింది.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073